జిల్లా అభివృద్ధికి తోడ్పాటునందిస్తాం

- కలెక్టర్ సృజనను కలిసిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లా అభివృద్ధికి అన్ని విధాలుగా తోడ్పాటునందిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయి తెలిపారు. నూతనంగా కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న డాక్టర్ సృజనను సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయి, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు కలెక్టర్‌తో మాట్లాడారు. జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. జిల్లాలో ప్రజలు చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఆ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని విన్నవించారు. సిపిఎంగా అన్ని విధాలుగా సహకారం అందిస్తామని వారు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం దేశంలో దేశ అభివృద్ధి కోసం, మహిళల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహిళా పోరాట యోధుల చరిత్ర పుస్తకాన్ని కలెక్టర్‌కు అందజేశారు.

కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సిపిఎం నాయకులు

అభ్యర్థులు వీరేనా..?

- యువగళంలో లోకేష్ హింట్ ఇచ్చారా..? - టిడిపి శ్రేణుల్లో మొదలైన చర్చ

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

రాబోయే ఎన్నికల్లో టిడిపి తరపున పోటీ చేసే అభ్యర్థులు వారేనా..? యువగళం పాదయాత్రలో నారా లోకేష్ హింట్ ఇస్తున్నారా..? ప్రస్తుతం జిల్లాలోని టిడిపి శ్రేణుల్లో ఇదే చర్చ నడుస్తోంది...

సార్వత్రిక ఎన్నికలకు ఇంకా సంవత్సరం మాత్రమే సమయం ఉంది. అదే సందర్భంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర చేపట్టారు. ఆ యాత్ర ఇప్పటికే 75 రోజులు పూర్తి చేసుకుంది. ఈ పాదయాత్రలో ప్రతి నియోజకవర్గంలో ఒక బహిరంగ సభ నిర్వహిస్తున్నారు. ఈ సభలో లోకేష్ మాట్లాడడం పూర్తయిన తర్వాత లోకేష్ ఒకరి చేయి పైకెత్తి నినాదాలు చేయిస్తున్నారు. దీనిపై జిల్లా టిడిపి శ్రేణుల్లో చర్చ మొదలైంది. ప్యాపిలి మండలంలోని సభలో ధర్మవరం సుబ్బారెడ్డి, తుగ్గలి మండలంలోని సభలో కెఇ.శ్యాంబాబు, ఆస్పరి మండలంలోని సభలో కోట్ల సుజాతమ్మ చేతిని లోకేష్ ఎత్తి పిడికిలి బిగించి చూపించారు. వారే రాబోయే ఎన్నికల్లో టిడిపి తరపున పోటీ చేసే అభ్యర్థులంటూ టిడిపి నాయకులు చర్చించుకుంటున్నారు. గతంలో ప్యాపిలి మండలం జలదుర్గంలో ఏర్పాటు చేసిన బాదుడే బాదుడు కార్యక్రమంలో టిడిపి అధినేత చంద్రబాబు టిడిపి డోన్ అభ్యర్థిగా ధర్మవరం సుబ్బారెడ్డి పేరును ప్రకటించారు. యువగళంలో ఆయనకు వ్యతిరేకంగా కరపత్రాలు బయటపడ్డాయి. ఆయన వైసిపి కోవర్టులా పని చేస్తున్నారని, పార్టీకి నష్టం జరుగుతుందని ఆ కరపత్రాల్లో పేర్కొన్నారు. ఆలూరు నియోజకవర్గానికి సంబంధించి కోట్ల సుజాతమ్మతో పాటు వైకుంఠం ప్రసాద్, వైకుంఠం మల్లికార్జున కూడా టిడిపి టికెట్‌ను ఆశిస్తున్నారు. యువగళం సభలో లోకేష్ సుజాతమ్మనే టిడిపి అభ్యర్థిగా ఖరారు చేశారన్న వార్తలు వినిపిస్తున్నాయి. అదేం లేదని పార్టీ అధినేత టికెట్లను ఖరారు చేస్తారనే వాదన కూడా టిడిపి వర్గాల్లో వినిపిస్తోంది. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి టికెట్ ఎవరికి దక్కుతుందో ఎదురు చూడాల్సిందే..

కోట్ల సుజాతమ్మను పరిచయం చేస్తున్న లోకేష్ (ఫైల్)

బాధితులకు న్యాయం చేస్తాం

- ఎస్పీ కృష్ణకాంత్

- జిల్లా ప్రధాన న్యాయమూర్తిని, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్పీ

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం అందించేలా పోలీసు శాఖ తరపున కృషి చేస్తామని ఎస్పీ జి.కృష్ణకాంత్ తెలిపారు. బుధవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.శ్రీనివాస రావును, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సిహెచ్.వెంకట నాగ శ్రీనివాస రావును జిల్లా కోర్టులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నేరం చేసిన వారికి త్వరగా శిక్ష పడేలా పూర్తి సహాయ, సహకారాలు కావాలని కోరారు. పెండింగ్ కేసులను తగ్గించడానికి, లోక్ అదాలత్ ద్వారా అధిక సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యే విధంగా జిల్లా న్యాయశాఖ, జిల్లా పోలీసు శాఖలు సమన్వయంతో పని చేసి బాధిత కుటుంబాలకు సత్వర న్యాయం జరిగేలా కృషి చేయడంపై చర్చించారు. కర్నూలు జిల్లా ఎస్పీగా బాధ్యతలు తీసుకున్న జి.కృష్ణకాంత్‌ను జిల్లా జడ్జి అభినందించారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిని కలిసిన ఎస్పీ

ప్రజలను కార్యాలయాల
చుట్టూ తిప్పకోవద్దు

- భూ హక్కు పత్రాల పంపిణీ 48 గంటల్లో పూర్తి - కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

'మనమంతా ప్రజా సేవకులం. ప్రజలను పదే పదే కార్యాలయాల చుట్టూ తిప్పకోకుండా సమస్యలను త్వరగా పరిష్కరించాల'ని కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పుకోకుండా పని చేయాలని ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్లు, డిఎల్‌పిఒలతో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ నారపరెడ్డి మౌర్యతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సబ్ డివిజన్, మ్యుటేషన్ కరెక్షన్ వంటి చిన్న, చిన్న సమస్యల పరిష్కారం కోసం సింపుల్‌గా వారి ఇంటి దగ్గరే సచివాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అలాకాకుండా ప్రజలు ఇంతదూరం వస్తున్నారంటే సచివాలయంలో అందే సేవల గురించి వారికి చేరడం లేదని అనుకోవాలా అని ప్రశ్నించారు. సచివాలయంలో ఇలాంటి సేవలు అందుతున్నాయని సచివాలయంలోని రెవెన్యూ ఉద్యోగులు ప్రజలకు తెలియజేయాలని ఆదేశించారు. స్పందన సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ఉండకూడదని తెలిపారు. ఆదోని, పత్తికొండలో జరుగుతున్న స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ మే 15 నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదోని సబ్ కలెక్టర్, పత్తికొండ ఆర్‌డిఒను ఆదేశించారు. ఒక రోవర్‌కు 120 స్టోన్ ప్లాంటేషన్ లాగా చేయాలని తెలిపారు. కొన్ని చోట్ల 100లోపు చేస్తున్నారని చెప్పారు. తక్కువ చేస్తున్న వారితో సమీక్ష నిర్వహించి పురోగతి తీసుకురావాలని ఆదేశించారు. 86 గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న చెక్ పాయింట్లను త్వరగా చేయాలని సర్వే ఎడికి సూచించారు. ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సెల్ యాక్టివ్ చేసుకోవాలని, పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి ఏదైనా పోలింగ్ కేంద్రం కొత్తగా పెట్టాలంటే అందుకు సంబంధించిన ప్రపోజల్స్ సిద్ధం చేసుకోవాలని తెలిపారు. జెసి నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ... ఎఫ్‌పిఒఎల్‌ఆర్‌కు సంబంధించి ఆన్‌లైన్‌లో డేటా ఎంట్రీ పెండింగ్‌లో ఉన్న 60 గ్రామాల్లో తహశీల్దార్లు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఓర్వకల్, వెల్దుర్తిలో గ్రౌండ్ ట్రూతింగ్ పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. స్వమిత్ర (రీ సర్వే అబాడి భూములు)కు సంబంధించిన పురోగతి గురించి డిపిఒను ఆరా తీయగా 67 గ్రామాల్లో అబాడి రీ సర్వే సెలెక్ట్ చేసినట్లు తెలిపారు. అందులో 45 గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తి చేశామని, 35 గ్రామాలకు నోటిఫికేషన్ కూడా ఇచ్చారని వివరించారు. మిగిలిన గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్నాయని జెసికి విన్నవించారు. ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఒ నాగేశ్వర రావు, కర్నూలు ఆర్‌డిఒ హరి ప్రసాద్, పత్తికొండ ఆర్‌డిఒ మోహన్ దాస్, డిపిఒ నాగరాజు నాయుడు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

అడుగులు వేస్తూ.. సమస్యలు వింటూ

- ఆస్పరి మండలంలో యువగళం పాదయాత్ర - రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటాం - టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/ఆస్పరి

అడుగడుగునా సమస్యలు వింటూ టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ముందుకు సాగారు. ఆయన చేపట్టిన యువగళం పాదయాత్ర బుధవారం ఆస్పరి మండలంలో సాగింది. వలిగొండ క్రాస్ నుంచి ప్రారంభమైంది. వలిగొండ, పుప్పాలదొడ్డి, కైరుప్పల, వెంగళదొడ్డి క్రాస్, కారుమంచి, ములుగుందం వరకూ సాగింది. తుమ్మలవంకపై వర్షాకాలంలో ప్రయాణించలేక ఇబ్బందులు పడుతున్నామని, బ్రిడ్జిని నిర్మించాలని వలిగొండ గ్రామస్తులు లోకేష్‌కు విన్నవించారు. వ్యవసాయంలో నష్టం రావడంతో తన భర్త గతనెల 31న ఆత్మహత్య చేసుకున్నాడని, అప్పులు తీర్చాలని అప్పులిచ్చిన వారు ఒత్తిడి చేస్తున్నారని, కలెక్టర్‌ను కలిసినా పరిహారం అందలేదని చిరుమానుదొడ్డికి చెందని ఖాసీంబీ లోకేష్ ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు. పరిహారం కోసం ప్రభుత్వానికి లేఖ రాస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. పుప్పాలదొడ్డిలో యాదవులు లోకేష్‌ను కలిశారు. గొర్రెల కాపరులకు 50 ఏళ్ల పింఛను ఇవ్వాలని, గొర్రెలతో పాటు ఆవులను కూడా రాయితీపై అందించి వాటికీ ఇన్సూరెన్స్ కల్పించాలని కోరారు. వెంగలాయదొడ్డి చెరువు నిండకపోవడం వల్ల పొలాలు బీళ్లుగా మారుతున్నాయని, లిఫ్ట్ ఇరిగేషన్ పెట్టాలని కైరుప్పల గ్రామస్తులు లోకేష్‌కు విన్నవించారు. కారుమంచిలో బీసీ సామాజికవర్గం ప్రతినిధులతో లోకేష్ ముఖాముఖి నిర్వహించారు. బెంజి మంత్రి వాల్మీకులకు చేసింది ఏంటని ప్రశ్నించారు. ఇట్టినా భూములను తాను కొంటానని సవాల్ విసిరానని, ఆ భూములు రైతుల పేరిట రాయడానికి మంత్రి సిద్ధమా అని ప్రశ్నించారు. బీసీలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కారుమంచి మధ్యాహ్న విడిది కేంద్రంలో ప్రజలతో సెల్ఫీలు దిగారు. కారుమంచి శివార్లలో పొలం పనులు చేసుకుంటున్న ఓ రైతు వద్దకు వెళ్లి అరక దున్నుతూ రైతు కష్టాలు తెలుసుకున్నారు. టిడిపి అధికారంలోకి రాగానే అన్నదాతలను అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. తమ గ్రామంలో తాగునీటి ఎద్దడి అధికంగా ఉందని, డ్రైనేజీలు, సీసీ రోడ్లు లేవని కారుమంచి గ్రామస్తులు లోకేష్ దృష్టికి తీసుకొచ్చారు. ములుగుందం సర్పంచి, ఎంపిటిసి లోకేష్‌ను కలిసి తమ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. పంచాయతీ ఎన్నికల్లో టిడిపి గెలవడంతో తమ గ్రామంలో రోడ్డు పనులను ఆపేశారని తెలిపారు. రోడ్లు వేయించాలని, సాగు, తాగునీరు అందించాలని కోరారు. ములుగుందం శివార్లలో క్యాంపు సైట్‌లో బస చేశారు. బుధవారం మొత్తంగా యువగళం పాదయాత్ర 15.5 కిలోమీటర్లు సాగింది. కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి, మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ, ఆలూరు మాజీ ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్, వైకుంఠం మల్లికార్జున చౌదరి, ప్రసాద్, జ్యోతి, ఆస్పరి మాజీ జడ్‌పిటిసి బొజ్జమ్మ, దేవనకొండ మాజీ ఎంపిపి రామచంద్ర నాయుడు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న లోకేష్

యువగళంలో ఆసక్తికర సన్నివేశం

యువగళం పాదయాత్రలో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. పుప్పాలదొడ్డిలో ఓ బాలుడు పసుపురంగు టీ షర్టుతో ఉత్సాహంగా యాత్రలో అడుగులు వేస్తుండగా గమనించిన లోకేష్ ఆ బాలుని దగ్గరకు తీసుకొని ఆప్యాయంగా పలుకరించారు. 'అప్పుడే రాజకీయాలు వద్దు. ముందు మంచిగా చదువుకోవాల'ని చెప్పి టీ షర్టు తీయించి నచ్చజెప్పి పంపించేశారు.

నీటి కష్టాలు చూశావా బెంజి మంత్రీ..?

కారుమంచి గ్రామంలో ఒకే బోరు ఉండడంతో ఆ బోరు వద్ద నీళ్లు పట్టుకుని తోపుడుబండ్లపై తోలుకుంటూ గొంతు తడుముకుంటున్నారు. ఆ దారిగుండా వెళ్తున్న నారా లోకేష్ నీటి బిందెలతో నీటి కోసం వేచి ఉన్న వారితో సెల్ఫీ దిగారు. ప్రజల బాగోగులు చూడాల్సిన ఎమ్మెల్యే గుమ్మనూరు భూకబ్జాలు, సెటిల్‌మెంట్‌లతో మునిగి తేలుతూ జనం కష్టాలు గాలికొదిలేసి నాలుగేళ్లుగా ముఖం చేటేశారని లోకేష్ పేర్కొన్నారు. నియోజకవర్గంలో గుక్కెడు నీళ్లందక ప్రజలు పడుతున్న అవస్థలు చూశావా బెంజి మంత్రీ..? అంటూ లోకేష్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

జగన్ పాలన జన రంజకం : కాటసాని

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్

ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో జనరంజకంగా పరిపాలిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. బుధవారం ఆధ్వర్యంలో కల్లూరు అర్బన్ 26 వార్డ్ 66 వ సచివాలయం, రాజీవ్ నగర్‌లో గడప,గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే వార్డులోని ప్రతీ గడపకు వెళ్లి రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న జనరంజక పాలన, అవినీతి రహిత పాలన గురించి ప్రజలకు వివరిస్తూ, జగనన్న ప్రభుత్వాన్ని దీవించాలని కోరారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికీ అందేలా చూడాలని సంబంధిత సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఈకార్యక్రమంలో స్థానిక వార్డ్ కార్పొరేటర్ దండు లక్ష్మీకాంత్ రెడ్డి, కార్పొరేటర్లు సంగాల సుదర్శన్ రెడ్డి, నాయకులు బాల చంద్రారెడ్డి, తిరుపాల్, కల్లూరు సింగిల్ విండో ప్రెసిడెంట్ శివ శంకర్ రెడ్డి,కర్నూలు డి.ఎ.ఎ.బి చైర్మన్ బెల్లం మహేశ్వర రెడ్డి,ఆంధ్రప్రదేశ్ వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోలు గోపాల్ రెడ్డి, భీమ శంకర్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,తిరుమలేష్ గౌడ్,పెద్దన్న, బ్రహ్మానంద రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ మూల్యాంకనం ప్రారంభం

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

కర్నూలులోని మాంటిసోరి ఉన్నత పాఠశాలలో టెన్త్ మూల్యాంకనం ప్రారంభమైంది. మొదటి రోజున 9999 పేపర్లు మూల్యాంకనం చేశారు . హిందీ ఇంగ్లీష్ తప్ప మిగతా సబ్జెక్టులో సరిపోయినంత మంది సహాయ ఎగ్జామినర్స్ విచ్చేశారు.. హిందీలో ఇంకా 54 మంది ఇంగ్లీషులో 32 మంది అవసరం ఉంది. మూల్యాంకనం క్యాంపు ఈనెల 26వ తేదీ వరకు జరుగుతుందని డిఇఒ వెంకట రంగారెడ్డి. రాష్ట్రస్థాయి పరిశీలకులు నరసింహారావు , క్యాంపును పరిశీలించి సలహాలు ఇచ్చారు. క్యాంపు ప్రశాంతంగా జరిగినట్లు అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు డీఈవో తెలిపారు

ఎస్‌పిని కలిసిన ఎపిడబ్ల్యుజెఎఫ్ బృందం

ప్రజాశక్తి -కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లా నూతన ఎస్పీ గా బాధ్యతలు తీసుకున్న జి.కృష్ణ కాంత్ ను బుధవారం ఎస్‌పి కార్యాలయంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ బృందం పూలబొకే ఇచ్చి మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్‌పి జి.కృష్ణకాంత్ మాట్లాడుతూ మీడియా పోలీస్ లు మంచి అనుసంధానంతో ఉండాలన్నారు. ప్రజా సమస్యలపై ఎప్పుడైనా కలవచ్చని తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిబబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి , ఆర్గనైజింగ్ కార్యదర్శి చిన్న రామాంజనేయులు, సీనియర్ నాయకులు ఫోటో జర్నలిస్ట్ యూనియన్ గౌరవాధ్యక్షులు డి.హుస్సేన్, జిల్లా అధ్యక్షులు వడ్డే శ్రీనివాసులు, సీనియర్ జర్నలిస్ట్ సత్యన్న, జిల్లా ఉపాధ్యక్షుడు బసప్ప, నగర ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, కోశాధికారి నజీర్ బాషా, సహాయ కార్యదర్శి సునీల్ కుమార్, ఉపాధ్యక్షుడు రమేష్, నగర నాయకులు మధు బాబు, నాగేంద్రుడు, మెట్రో టివి స్టాఫ్ రిపోర్టర్ మధు, తదితరులు పాల్గొన్నారు.

బిజెపిని తరిమికొట్టండి : సిపిఎం, సిపిఐ పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : పుల్వామాలో 2019లో వీర జవాన్ల శవాలపై రాజకీయం చేసి లబ్ధి పొందిన బిజెపిని దేశం నుండి తరిమికొట్టండని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప కోరారు. బుధవారం బిజెపి విధానాలకు వ్యతిరేకంగా భాగంగా బంగారు పేట ఏరియాలో సిపిఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, సిపిఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి నాయకత్వంలో వామపక్షాలు చేపట్టిన ప్రచార యాత్రను ఉద్దేశించి వారు ప్రసంగించారు. 2019లో నరేంద్ర మోడీ అనుసరిస్తున్న విధానాలపై విసిగి వేసారి చెందిన ప్రజలు బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలనే తరుణంలో పుల్వామాలో ఉగ్రవాదుల దాడిలో 40 మంది జవాన్లు చనిపోయిన తర్వాత పాకిస్తానీ బూచి చూపించి పాకిస్థాన్‌ను తరిమికొట్టాలంటే బిజెపి లాంటి పార్టీ అవసరం అని ప్రజలను నమ్మించి ఎన్నికల లబ్ధి పొందిన నరేంద్ర మోడీ అసలు రంగు బయటపడిందని విమర్శించారు. ఆరోజు జమ్ముకాశ్మీర్ గవర్నర్‌గా ఉన్న సత్యపాల్ మాలిక్ ద వైర్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో చాలా స్పష్టంగా పులువామా ఘటనకు కారకులు బిజెపి ప్రభుత్వం, నరేంద్ర మోడీ అని కుండలు బద్దలు కొట్టినటు స్పష్టం చేశారని తెలిపారు. ఆరోజు ఉగ్రవాదుల దాడులు జరుగుతాయని తెలిసి కూడా పెద్ద సంఖ్యలో సైనికులను రోడ్డు మార్గం ద్వారా పంపడం ప్రభుత్వం చేసిన నేరమని మాలిక్ తెలిపాడనివివరించారు. ఆరోజు సైనికులు మాకు విమానాలను సిద్ధం చేయండి అని చెప్పినా హోం మంత్రిత్వ శాఖ నిర్ద్వంద్వంగా దాన్ని తిరస్కరించి రోడ్డు మార్గం ద్వారానే పోయేలాగా చేసిఉగ్రవాదుల దాడుల్లో 40 మంది బలి కావడానికి కారణం కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా తీసుకున్న నిర్ణయమే తప్ప మరొకటి కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు మనోహర్ మాణిక్యం, నగర నాయకులు చంద్రశేఖర్, మహేష్, సిపిఎం నాయకులు సుభాన్, అబ్దుల్ దేశాయ్, కుమార్, శేఖర్, మద్దయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయి

తుగ్గలి : ప్రజా వ్యతిరేక విధానాలను అను సరిస్తున్న దేశ ప్రధాని మోడీని గద్దె దించాలని, దేశాన్ని కాపాడాలని రైతు సంఘం నాయకులు గురుదాస్ ,నబిరసూల్, సిపిఎం నాయకులు రంగరాజు, సిపిఐ మండల కార్యదర్శి సుల్తాన్ అన్నారు. 6వ రోజు సిపిఎం, సిపిఐ ప్రచార భేరి తుగ్గలి మండలం ఎద్దుల దొడ్డి, పెండేకల్లు గ్రామాల్లో కొనసాగింది. సిఐటియు మండల అధ్యక్షులు రంగస్వామి, రైతు సంఘం మండల కమిటీ అధ్యక్షులు శ్రీనివాసులు, చదువుల కాశి, అన్వేష్, సిపిఐ, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

వెల్దుర్తి: వెల్దుర్తి మండలం రత్నపల్లి, బోయినపల్లి గ్రామాలలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ప్రజా వ్యతిరేక నిరంకుశ మతోన్మాద బిజెపిని సాగనంపుదాం భారతదేశన్ని కాపాడుకుందాం అనే నినాదంతో ప్రచార బేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. సిపిఎం జిల్లా నాయకులు నగేష్, సిపిఐ మండల కార్యదర్శి కృష్ణ మాట్లాడారు.

కోడుమూరు: సిపిఐ సిపిఎం ఆధ్వర్యంలో తలపెట్టిన ప్రచార భేరి కోడుమూరులోని కళ్ళుపెంట వీధి, చిన్నబోయ వీధి, కొత్తపేట కొండపేటలో నిర్వహించారు. సిపిఎం మండల కార్యదర్శి గఫూర్‌మియా, సిపిఐ మండల కార్యదర్శి బి.రాజు, సిఐటియు మండల కార్యదర్శి జిపి వీరన్న ఆధ్వర్యంలో నిర్వహించారు.

క్రీడాకారులను పరిచయం చేస్తున్న టిజిభరత్

క్రమశిక్షణతో క్రీడల్లో రాణించాలి : టిజి.భరత్

ప్రజాశక్తి-కర్నూల్ స్పోర్ట్స్

క్రీడాకారులు తాము ఎంచుకున్న క్రీడల్లో క్రమశిక్షణ, అంకిత భావంతో సాధన చేసి ఉన్నత స్థాయికి ఎంచేరుకోవాలని కర్నూలు అసెంబ్లీ టిడిపి ఇన్చార్జి టిజి. భరత్ అన్నారు. కర్నూలు నగరంలోని ఎస్‌టిబిసి కళాశాల మైదానంలో ఏర్పాటుచేసిన ప్రతాపరెడ్డి స్మారక హాకీ పోటీల సందర్భంగా క్రీడాకారులకు హాకీ బ్యాట్లతో పాటు క్రీడా దుస్తులను ఆయన పంపిణీ చేశారు. టిజి. భరత్ మాట్లాడుతూ తండ్రి ప్రతాపరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు విదేశాల్లో ఉంటూ నగరంలో హాకీ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. వ్యాయామ ఉపాధ్యాయుడిగా ప్రతాపరెడ్డి అందరికీ ఆదర్శప్రాయమని, చిన్నతనం నుంచి తనకు ఆయనతో అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. జీవితంలో క్రమశిక్షణకు ఉత్తమ వ్యక్తిత్వానికి ప్రతాపరెడ్డి ప్రతీకని, అలాంటి వారిని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరు ముందుకు సాగాలన్నారు. క్రీడల్లో క్రమశిక్షణ అంకితభావంతో ముందుకు సాగాలన్నారు. కర్నూలు నగరంలో క్రీడల అభివద్ధికి అవసరమైన సహకారం తమ నుంచి ఎప్పుడు ఉంటుందని యువనేత టీజీ భరత్ వెల్లడించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు కిరణ్, ప్రదీప్ సామ్, మల్లికార్జున, శివశంకర్ భాస్కర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో క్లీన్ అండ్ గ్రీన్

కార్యాలయాల్లో పరిశుభ్రత పాటించాల్సిందే

కలెక్టర్ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : కలెక్టరేట్ కార్యాలయం అంటే జిల్లాకు కేంద్ర బిందువుగా ఉండే కార్యాలయం. ఈ కార్యాలయం నుండే జిల్లా పరిపాలన కొనసాగుతుంది. అలాంటి కార్యాలయంలో గత కొన్ని ఏళ్లుగా పరిశుభ్రత వాతావరణం లేకపోవడంతో ఇటీవల జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ జి.సృజన అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఇకనుంచి కలెక్టరేట్ కార్యాలయంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని ఆదేశించారు. కార్యాలయాల్లో పరిశుభ్రత వాతావరణం ఉంటేనే ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామనికలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు కలెక్టరేట్లోని అన్ని శాఖలకు చెందిన అధికార యంత్రాంగం కదిలి తమ శాఖల కార్యాలయాలను పరిశుభ్రంగా పెట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో ప్రధానంగా రెవెన్యూ, పౌరసరఫరాల, ముఖ్య ప్రణాళిక అధికారి,ఖజానా శాఖ,వ్యవసాయ శాఖ ఉద్యానవన శాఖ, పశుసంవర్ధక శాఖ, పట్టు పరిశ్రమ శాఖ ,జిల్లా స్త్రీ , శిశు సంక్షేమ ప్రాజెక్టు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, జిల్లా పంచాయతీ శాఖ అధికారి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ, మైనార్టీ కార్పొరేషన్, విద్యాశాఖ, సమగ్ర శిక్ష అభియాన్, తదితర కీలకమైన శాఖలు ఉన్నాయి. ఈ శాఖల నుండే మండల కేంద్రాల్లో పరిపాలన కొనసాగేందుకు ఇక్కడి నుండి ఆదేశాలు జారీ అవుతుంటాయి. ఈ శాఖల కార్యాలయాలు గతంలో అపరిశుభ్రత వాతా వరణంతో ఎక్కడికి అక్కడ పేపర్లు పాడైపోయిన కంప్యూటర్లు, వంటి వాటితో చిందరగా ఉండేవి. ప్రతి శాఖ కార్యాలయంలో ఉన్న టాయిలెట్స్ సరైన వసతులు లేకపోవడంతో కంపు కొడుతూ మరుగున పడ్డాయి. ఇటీవల జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన కలెక్టర్ కార్యాలయంలోని అన్ని విభాగాలను సందర్శించి అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఎక్కడికక్కడ చిత్తు కాగితాలు పాడైపోయిన కంప్యూటర్లను చూసి ఆగ్రహం వ్యక్తం చేసి వెంటనే వాటిని తరలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు.

మగువల కోసం వన్ గ్రామ్ గోల్డ్

రాధాకృష్ణ పెరల్స్ , జేమ్స్, స్కంద హబ్,అబ్దుల్లా ఖాన్ ఎస్టేట్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



అచ్చం బంగారు ఆభరణాలను పోలిన వన్‌గ్రామ్ గోల్డ్ నగలు మార్కెట్లో విపరీతంగా అమ్ముడవుతున్నాయి. ఇప్పుడు వీటిని కూడా బంగారు ఆభరణాల్లా ఆర్డరిచ్చి మనకు నచ్చినట్టు చేయించుకోవచ్చు. ఇత్తడేదో పుత్తడేదో తెలియనంతగా అందమైన రాళ్ల నగిషీలతో మెరిసిపోతూ వన్‌గ్రామ్ గోల్డ్ నగలు రావడంతో వయసు భేదం లేకుండా చిన్నా పెద్దా అందరూ వీటిని ఇష్టంగా ధరిస్తున్నారు. చెవిపోగుల నుంచి కాలిపట్టీల దాకా, హారాల నుంచీ వడ్డాణాల దాకా అచ్చంగా బంగారాని వేమో అనిపించేలా ఇవి రూపొందుతున్నాయి. సరికొత్తగా పచ్చలూ, కెంపులూ, పగడాల దండలు సహా రకరకాల పూసలలో బంగారం ఇమిడ్చి నగలు చేస్తాం. మా వద్ద వన్‌గ్రామ్ గోల్డ్ నగలు తయారవుతున్నాయి. ఇప్పటిదాకా వన్‌గ్రామ్ గోల్డ్ నగలంటే ఉన్నవి ఉన్నట్టుగా కొనుక్కోవడమే. ఇప్పుడు మనకు ఏదైనా బంగారు నగ నచ్చితే దానిలాగానే వీటినీ చేయించు కోవచ్చు. వీటి ధర 500 నుంచి ప్రారంభమవుతాయి యజమాని కెవి. రాధాకృష్ణ తెలిపారు. సంప్రదించాల్సిన ఫోన్ : 9398307785.

నరసప్ప కొండను తొలగించాలి

- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్‌బాబు

ప్రజాశక్తి - గోనెగండ్ల

ధర్నాలో మాట్లాడుతున్న ఆనంద్ బాబు

గోనెగండ్లలో పగిలిన నర్సప్ప కొండను వెంటనే తొలగించాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.ఆనంద్ బాబు, ఉపాధ్యక్షులు కరుణాకర్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానికులతో కలిసి నర్సప్పకొండ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కొండ పగిలి 11 రోజులైనా అధికారుల మాటలు తప్ప చేతలు ప్రారంభం కాలేదని మండిపడ్డారు. 6000 నుంచి 8000 టన్నుల బరువు ఉండే కొండ ఒక్కసారి ఛిద్రమయితే చుట్టుపక్కల అర కిలోమీటరు విస్తీర్ణం వరకు తీవ్ర ప్రమాదం ఏర్పడుతుందని తెలిపారు. తెలిసినా కొండను తొలగించే పనులు ఇప్పటికీ ప్రారంభించలేదన్నారు. పది రోజుల క్రితం పగిలిన కొండ ఇంచు నుంచి ఆరు ఇంచుల వరకూ పగులు విస్తీర్ణం పెరిగిందన్నారు. ప్రమాదం జరిగిన తర్వాత మాటలు చెప్పడం కాకుండా, దళితుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరారు. వెంటనే పనులు ప్రారంభించకపోతే సోమవారం దళితులతో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. స్థానిక దళితులు మునెప్ప, రాజు, ఎస్తేరమ్మ, ఎరుకలి ఉలిగమ్మ, నాగరాజు, నాగప్ప, నడిపి బతకన్న, గంజి రోగన్న, నరసింహుడు, రంగమ్మ, హనుమక్క పాల్గొన్నారు.

జాబ్ కార్డున్న ప్రతి కూలీకీ పని కల్పించాలి

- మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - దేవనకొండ

గ్రామాల్లో జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీకీ ఉపాధి పనులు కల్పించాలని, హార్టికల్చర్ కింద ఉచితంగా రైతులకు ఇస్తున్న పండ్ల మొక్కలపై అవగాహన కల్పించి పండ్ల తోటల పెంపకాన్ని అభివృద్ధి చేయాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, ఏపీడీ పద్మావతి తెలిపారు. బుధవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఉపాధి హామీ చట్టం పనులపై ఏపీఓ కృష్ణమూర్తి అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు తప్పకుండా పనులు కల్పించాలని ఆదేశించారు. ప్రతి కూలీకీ రూ.272 వేతనం అందేలా పనులు చేయించాలని తెలిపారు. ప్లాంటేషన్ సూపర్‌వైజర్ రత్నం, ఈసీ రంగస్వామి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఘనంగా అమరావతి హైస్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - ఆదోని

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గుడిసె కృష్ణమ్మ

పట్టణంలో అతి తక్కువ కాలంలో ప్రఖ్యాతిగాంచిన అమరావతి ఇంటర్నేషనల్ హై స్కూల్ 7వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించినట్లు కరస్పాండెంట్ గుడిసె రామకృష్ణ తెలిపారు. ముఖ్యఅతిథిగా టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విలువలతో కూడిన విద్యనందించినప్పుడే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. ఆ దిశగా అమరావతి స్కూల్ కొనసాగడం శుభపరిణామమన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

లోకేష్ పాదయాత్రతో వైసిపి పతనం ఖాయం

- టిడిపి జిల్లా అధ్యక్షులు సోమిశెట్టి, ఇన్‌ఛార్జి తిక్కారెడ్డి

ప్రజాశక్తి - కోసిగి రూరల్

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రతో వైసిపి ప్రభుత్వ పతనం ఖాయమని టిడిపి జిల్లా అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక రేణుక ఎల్లమాంబ ఆలయ ప్రాంగణంలో సభా స్థలాన్ని టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షులు జ్ఞానేష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 24న లోకేష్ యువగళం పాదయాత్ర కోసిగి మండలానికి చేరుకుంటుందని తెలిపారు. భారీ సభతో పాటు రాత్రి బస ఏర్పాట్లను పరిశీలించినట్లు చెప్పారు. టిడిపితోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమన్నారు. వైసిపి ప్రభుత్వంతో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. ఇంతవరకు రాజధాని లేని ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో టిడిపి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని కోరారు. నాడిగేని అయ్యన్న, భరద్వాజ్ శెట్టి, మహాదేవ, కొండగేని వీరారెడ్డి, వందగల్లు నరసింహులు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సోమిశెట్టి, తిక్కా రెడ్డి

లోకేష్ పర్యటనలో.. కనిపించని ఐక్యతరాగం...

- ఆలూరు టిడిపిలో బహిర్గతమైన గ్రూపు పోరు

- గ్రూపు పోరు నివారణకు చర్యలు శూన్యం....

ప్రజాశక్తి-ఆలూరు

నాయకులందరూ ఐక్యంగా ఉండి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించాలని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనలో జరిగిన సమావేశంలో చెప్పారు. ఎంత చెబుతున్నా ఆచరణలో మాత్రం నాయకుల మధ్య ఉన్న గ్రూపు పోరు పతాక స్థాయికి చేరి అధినేతలు వచ్చినా నాయకుల్లో మాత్రం ఐక్యత కనిపించడం లేదు. ఆలూరు టిడిపిలో గతంలో మూడు గ్రూపులుగా ఉండి ఈ పర్యటనలో రెండు గ్రూపులుగా దర్శనమిస్తున్నాయి. కొన్ని రోజుల క్రితం జరిగిన మాజీ ఇన్‌ఛార్జీ వైకుంఠం మల్లికార్జున చౌదరి పుట్టినరోజు వేడుకల్లో మాజీ ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్, కప్పట్రాళ్ల బొజ్జమ్మ ఐక్యమయ్యారు. అధిష్టానం తమలో ఎవరికి సీటు ఇచ్చినా ఒకరికొకరు సహకరించుకోవడంతో పాటు కోట్ల సుజాతమ్మ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించాలని ఒక మాటపై ఉన్నట్లు సమాచారం. తర్వాత కూడా ఆస్పరి మండలంలో జరిగిన వివిధ కార్యక్రమాల్లో ముగ్గురు కలిసి పర్యటించారు.

లోకేష్ పర్యటనలో ఫ్లెక్సీల రగడ...

ఆలూరు నియోజకవర్గంలో జరిగిన లోకేష్ పర్యటనలో ఫ్లెక్సీల రగడ చోటు చేసుకుంది. దేవనకొండ మండలంలో వైకుంఠం బ్రదర్స్, డేగలపాడు నారాయణప్ప తదితరులు సొంతంగా వేసిన ఫ్లెక్సీ బ్యానర్లను కోట్ల గ్రూపు అడ్డుకొని చించేశారు. ఈ సంఘటన లోకేష్ దృష్టికి వచ్చినా, గ్రూపు విభేదాలు చూపుతున్న నేతలను ఫ్లెక్సీల్లో ఇన్‌ఛార్జీ ఫొటోలు లేకుండా ఎలా వేస్తారని, ప్రొటోకాల్ తప్పక పాటించాలని లోకేష్ తెలిపినట్లు తెలిసింది. ఆ వెంటనే కోట్ల సుజాతమ్మ స్టిక్కర్స్‌ను తమ ఫ్లెక్సీలపై అతికించారు. ఈ గ్రూపు సమస్యలను పరిష్కరించలేదని టిడిపి శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

లోకేష్‌తో కలిసి నడుస్తున్న సుజాతమ్మ

విడివిడిగా జన సమీకరణ...

తమ నాయకుని పాదయాత్రను విజయవంతం చేసేందుకు ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ ఆయా మండలాల్లో పార్టీ కార్యాలయం నుంచి భారీ వాహనాల్లో జన సమీకరణ చేశారు. వీరభద్ర గౌడ్, మల్లికార్జున చౌదరి, బొజ్జమ్మ ఐక్యంగా వాహనాలు ఏర్పాటు చేసి జన సమీకరణ చేపట్టారు. వైకుంఠం శివప్రసాద్ కూడా సొంతంగా వాహనాలు ఏర్పాటు చేసి జనాలను తరలించారు. ఈ వాహనాలపై ఏర్పాటు చేసిన స్టిక్కర్లలో తమ ఫొటోలు తప్ప టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ ఫొటో లేకపోవడం గమనార్హం.

లోకేష్‌తో కలిసి నడుస్తున్న నాయకులు

వైకుంఠం మల్లికార్జున చౌదరి, వీరభద్ర గౌడ్, బొజ్జమ్మ వివిధ పత్రికల్లో ఇచ్చిన యాడ్‌లలో కూడా ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ ఫొటో లేకుండా వేశారంటే విభేదాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతుంది.

గ్రూపుపోరు నివారణకు చర్యలు శూన్యం...

ఆలూరు టిడిపిలో దశాబ్దాల గ్రూపు పోరును నివారించడంలో అధినాయకత్వం విఫలమైంది. ఇందుకు మూల్యంగా రెండు దశాబ్దాలకుపైగా జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి ఓటమి చవిచూస్తూనే వస్తోంది. ప్రస్తుతం అధినాయకులు నియోజకవర్గంలో పర్యటిస్తున్నా, వారి సాక్షిగానే గ్రూపు పోరు నడుస్తున్నా అధినాయకులు తీసుకున్న చర్యలు నామమాత్రంగానే కనిపిస్తున్నాయి. ఈ విషయం టిడిపి అధిష్టానానికి ఎలా ఉన్నా ద్వితీయ స్థాయి నాయకులు, కార్యకర్తలు అయోమయంలో ఉన్నారు. ప్రతి మండలంలో కూడా వైకుంఠం బ్రదర్స్, వీరభద్ర గౌడ్, కోట్ల సుజాతమ్మ గ్రూపులు కనిపిస్తున్నాయి. వారి వెంట నడుస్తున్న వారు భవిష్యత్తులో గ్రూపు పోరు నివారించకపోతే మరోసారి టిడిపి మూల్యం చెల్లించక తప్పదని పేర్కొంటున్నారు.

నిరుపేదలకు చేతనైన సాయం

- గురురాజ్ దేశాయి

- దేశాయి నెట్‌వర్క్ ఆధ్వర్యంలో పేద ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ

ప్రజాశక్తి - నందవరం

ప్రతి ముస్లిం రంజాన్ పండగను సంతోషంగా జరుపుకోవాలని, అందుకు చేతనైన సహాయం అందించాలని దేశాయి నెట్‌వర్క్ అధినేత గురురాజ్ దేశాయి కోరారు. బుధవారం నందవరంలో అహలే హదీస్ మసీదులో రంజాన్ పండగ సందర్భంగా 70 నిరు పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎంతో పవిత్రంగా నెల రోజుల పాటు రోజా (ఉపవాసం) చేశారని, అలాంటి కుటుంబాలకు తన వంతు సహాయంగా రంజాన్ తోఫాను అందజేయడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. దేశాయి నెట్‌వర్క్ యూత్ అసోసియేషన్ సభ్యులు సాధిక్, తోట పాండు, శివ, రఘు, మాజీ సర్పంచి రామన్న గౌడ్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

తోఫాను అందజేస్తున్న గురురాజ్ దేశాయి

బిజెపిని సాగనంపుదాం.. దేశాన్ని కాపాడుకుందాం...

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయి

ప్రజాశక్తి - దేవనకొండ

కేంద్రంలోని మతోన్మాద బిజెపిని సాగనంపుదామని, దేశాన్ని కాపాడుకుందామని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయి, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బి.వీరశేఖర్, సిపిఐ మండల కార్యదర్శి నరసరావు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార భేరి పాదయాత్ర మండలంలోని పొట్లపాడు, కుంకనూరు, మాచాపురం, పి.కోటకొండ గ్రామాల్లో సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజల బాధలు, అవస్థలు అర్థం చేసుకోవడం లేదని విమర్శించారు. ధరలు విపరీతంగా పెంచి, ప్రజలు బతకలేని దుస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రయివేట్‌పరం చేస్తూ అదాని, అంబానీలకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. ప్రజల మధ్య మతవిద్వేషాలను సృష్టిస్తూ మతోన్మాదాన్ని రెచ్చగొడుతోందని తెలిపారు. మరోపక్క ప్రయివేటీకరణను అమలు చేస్తూ, ప్రభుత్వ ఆస్తులన్నింటినీ అమ్మేసేందుకు పూనుకుందని విమర్శించారు. ప్రజాసంఘాల నాయకులు నెట్టేకల్, సూరి సంజన్న, మాబాష, సుభాన్, రామాంజనేయులు, భాస్కర్, నరేష్ పాల్గొన్నారు. **గోనెగండ్ల**లో ఈనెల 24 నుంచి గోనెగండ్ల నిర్వహించే ప్రచార భేరిని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎమ్‌డి.ఆనంద్ బాబు కోరారు. గోనెగండ్లలోని బస్టాండ్ సెంటర్ సమీపంలో సిపిఎం, సిపిఐ ప్రచార భేరి గోడపత్రికను ఆనంద్ బాబు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి మునిస్వామి, సిపిఎం నాయకులు ఖాజా, కరుణాకర్, దేవేంద్ర, డేవిడ్ రాజు విడుదల చేశారు. **కౌతాళం**లోని పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశులు, సీనియర్ నాయకులు మల్లయ్య, మండల కన్వీనర్ వీరన్న, ఎస్‌ఎఫ్‌ఐ మాజీ నాయకులు వీరేష్, సిపిఐ మండల కార్యదర్శి ఈరన్న, సిపిఎం నాయకులు వలీ, నారాయణ, రాందాసు పాల్గొన్నారు. **మంత్రాలయం** మండలంలోని చెట్నిహల్లి, మాధవరం గ్రామాల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎమ్‌డి.అంజిబాబు, సిపిఐ జిల్లా నాయకులు భాస్కర్ యాదవ్, సిపిఎం మండల నాయకులు జయరాజు, సిపిఐ మండల నాయకులు లక్ష్మణ్ సింగ్, సురేష్, మారెప్ప పాల్గొన్నారు. **ఆదోని** పట్టణంలో నాయకులు సుదర్శన్, లక్ష్మన్న నాయకత్వంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.లక్ష్మారెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి బసాపురం గోపాల్, సిపిఎం జిల్లా నాయకులు పిఎస్.గోపాల్, తిప్పన్న హాజరై మాట్లాడారు. నాయకులు వెంకన్న, హుసేని, కల్లుబావి రాజు, ప్రకాష్, షేక్షావలీ, సాబీర్ బాష, కిషోర్, రమేష్ కుమార్, అంజిత్ గౌడ్, రామానాయుడు, తిక్కప్ప, నాగరాజు పాల్గొన్నారు. **హాలహర్వి** మండలంలో నాయకులు కెపి.నారాయణ స్వామి, కృష్ణ ఆధ్వర్యంలో ప్రచార భేరి నిర్వహించారు. **హోళగుంద** తహశీల్దార్ కార్యాలయంలో ప్రచార భేరి గోడపత్రికలను విడుదల చేశారు. సిపిఎం మండల కార్యదర్శి వెంకటేష్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి రంగన్న, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా సమితి సభ్యులు శ్రీరంగ, నాయకులు రాజు, ఎర్రిస్వామి, మల్లయ్య పాల్గొన్నారు.

దేవనకొండలో మాట్లాడుతున్న గౌస్ దేశాయి

కౌతాళంలో మాట్లాడుతున్న నాయకులు

గోనెగండ్లలో గోడ పత్రికలు విడుదల చేస్తున్న నాయకులు

అక్రమ కట్టడాల తొలగింపు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో అక్రమ కట్టడాల తొలగింపును మున్సిపల్ అధికారులు ముమ్మరం చేశారు. రోడ్డుకిరువైపులా ఏర్పాటు చేసుకున్న బంకులను, దుకాణాలను బుధవారం జెసిబి ద్వారా తొలగించారు. కాలువపై ఏర్పాటు చేయరాదని పలుమార్లు హెచ్చరించినా బేఖాతరు చేయడం వల్ల తొలగించామని అధికారులు తెలిపారు. వేలాది రూపాయలు వెచ్చించి చిన్నగా వ్యాపారం చేసుకునే వారిపై మున్సిపల్ అధికారులు ప్రతాపం చూపడం వల్ల జీవనోపాధి కోల్పోయామని బాధితులు వాపోయారు. కనికరం చూపకుండా మున్సిపల్ అధికారులు వ్యవహరించడం తగదని పలువురు విమర్శించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకున్నా తొలగింపునకు పూనుకోవడం ఏమిటని పలువురు నిందించారు. అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాగభూషణం రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ హరినాథ్, అసిస్టెంట్ ఇంజినీర్ మదన్ ఉన్నారు.

డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి : జెవివి

ప్రజాశక్తి - కోసిగి రూరల్

ప్రజలను మతమౌఢ్యంలోకి నెడుతున్న ప్రస్తుత తరుణంలో చార్లెస్ డార్విన్ 150 ఏళ్ల ప్రతిపాదించిన జీవ పరిణామ సిద్ధాంతాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు శంకరయ్య తెలిపారు. బుధవారం మండలంలోని దుద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చార్లెస్ డార్విన్ వర్ధంతి నిర్వహించారు. ముందుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటలక్ష్మి చార్లెస్ డార్విన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నేటి పరిస్థితుల్లో చార్లెస్ డార్విన్ ప్రతిపాదించిన జీవ పరిణామ సిద్ధాంత ఆవశ్యకత ఎంతైనా ఉందని తెలిపారు. శంకరయ్య మాట్లాడారు. జీవుల ఆవిర్భావానికి ఏ అతీత శక్తి తోడ్పడలేదని, జీవులు పరిసరాల్లోని మార్పులు, సంఘర్షణ వల్ల తరతరాల్లో వచ్చిన మార్పులు, కొన్ని కోట్ల సంవత్సరాల కాలంలో జరగడం వల్ల చివరిగా నేటి ఆధునిక మానవుడు ఆవిర్భవించాడని తెలిపారు. చార్లెస్ డార్విన్ ప్రతిపాదించిన జీవ పరిణామ సిద్ధాంతాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి మూఢనమ్మకాల నిర్మూలన, విభిన్న మతాల మధ్య శాంతి స్థాపనకు ప్రయత్నిం చాలని కోరారు. పాఠశాల ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, నవీన్‌కుమార్ రెడ్డి, నాగలింగమయ్య, కళావతి,

దళితవాడలో తాగునీటి సమస్యను పరిష్కరించాలి

- వామపక్ష నాయకులు

- రోడ్డుపై ఖాళీ బిందెలతో మహిళల నిరసన

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని మాధవరం దళితవాడలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మాధవరం గ్రామం దళిత కాలనీలోని మహిళలు ఖాళీ బిందెలతో 167వ జాతీయ రహదారిపై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎమ్‌డి.అంజిబాబు, సిపిఐ నియోజకవర్గ నాయకులు భాస్కర్ యాదవ్ మాట్లాడారు. దళితపేటలో సుమారు 200 కుటుంబాలు నివసిస్తున్నాయని తెలిపారు. గత 30 ఏళ్లుగా తాగునీటి సమస్య కొనసాగుతూనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తుంగభద్ర నది పక్కనే ఉన్నా తాగునీటి సమస్య ఉండడం దురదృష్టకరమని తెలిపారు. ప్రభుత్వాలు మారినా, ప్రజాప్రతినిధులు ఇక్కడ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నా తాగునీటి సమస్యను పరిష్కరించడం లేదని విమర్శించారు. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి తగిన ప్రణాళికలు రూపొందించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, సబ్ ప్లాన్ ద్వారా నిధులను సమీకరించి శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. లేకపోతే పంచాయతీలకు వస్తున్న 15వ ఆర్థిక ప్రణాళిక నిధులను కేటాయించి పైప్ లైన్లు వేసి తాగునీటి సమస్య లేకుండా చూడాలని తెలిపారు. వేసవిలో సమస్య తలెత్తకుండా తాత్కాలిక ఏర్పాట్లు చేయాలని కోరారు. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని, దళితపేటలో బోర్లు వేసేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్‌కు వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఆయన మాట్లాడుతూ... వారం రోజుల్లోపు సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సిపిఎం మండల కార్యదర్శి జయరాజు, సిపిఐ మండల నాయకులు లక్ష్మణ్ సింగ్, నాయకులు మారెప్ప, సురేష్, కుమార్, వీరేష్, నాగప్ప, బాబురావు, మధు కుమార్, చార్లెస్, సామ్యేల్ పాల్గొన్నారు.

నిరసన తెలియజేస్తున్న నాయకులు, మహిళలు

వంటశాలను పరిశీలిస్తున్న జిల్లా సమగ్ర శిక్ష పిఒ వేణుగోపాల్

నిర్మాణాలు పూర్తయ్యేలా చొరవ చూపాలి

- జిల్లా సమగ్ర శిక్ష పిఒ వేణుగోపాల్

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న రెండో ఫేస్ నిర్మాణ పనులు, ప్రభుత్వ కార్యాలయ భవన నిర్మాణాలు పూర్తయ్యేలా కాంట్రాక్టుదారులకు అవగాహన కల్పించేందుకు చొరవ చూపాలని జిల్లా సమగ్ర శిక్ష పిఒ వేణుగోపాల్ మండల అధికారులకు సూచించారు. బుధవారం మండల కార్యాలయంలో ఎంపిడిఒ సుధాకర్ రాజు ఆధ్వర్యంలో మండల అధికారులు, హౌసింగ్, సచివాలయ ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో నవరత్నాల పథకాల్లో భాగంగా ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం ఏ గ్రామమైతే నిర్మాణ పనుల్లో వెనుకబడి ఉందో జగనన్న కాలనీలు, సచివాలయం, ఆర్‌బికె నిర్మాణాలు, వైఎస్ఆర్ వైద్య క్లినిక్ నిర్మాణాలు, ప్రభుత్వ పాఠశాలలో సెకండ్ ఫేస్ కింద నాడు-నేడు ద్వారా జరుగుతున్న అదనపు గదుల నిర్మాణాల పనులు త్వరగా పూర్తయ్యేలా చూసుకోవాలని తెలిపారు. ప్రతి కాంట్రాక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించుకోవాలని ఆదేశించారు. అనంతరం కస్తూరిబా పాఠశాలలో రికార్డులను పరిశీలంచారు. భోజన వసతి గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎంఇఒ మస్తాన్ రావు, కెజిబివి ప్రధానోపాధ్యాయులు షబానా, ఎఒ ఆనంద్, పిఆర్ ఎఇ చోళ రెడ్డి, ఎపిఎం నాగార్జున, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రామనీలా, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రసూన, సిహెచ్‌ఒ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్రికెట్‌లో కెసిటిఆర్ జట్టు విజేత

హోళగుంద : కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా సిరుగుంప తాలూకా బండ్రాలు గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో కెసిటిఆర్ జట్టు విజేతగా నిలిచింది. బుధవారం బండ్రాలు, ఇంగలదహల్ కెసిటిఆర్ గ్రామాల మధ్య ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా సాగింది. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన బండ్రాలు జట్టు 84 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం ఇంగలదహల్ జట్టు 7 ఓవర్లకే లక్ష్యాన్ని ఛేదించి విజేతగా నిలిచింది. ఉత్తమ బౌలర్‌గా ఇంగలదహల్ ప్లేయర్ పంపాపతి, ఉత్తమ బ్యాటర్ బండ్రాలు జట్టు వీరేష్‌లు నిలిచారు. ట్రోఫీతో పాటు రూ.15 వేల నగదును అందుకున్న అనంతరం కెసిటిఆర్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు వీరేష్ మాట్లాడారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

- 'గడపగడపకు'లో ప్రజలు

కౌతాళం : మండలంలోని కుంటనహాలు గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని 'గడపగడపకు మన ప్రభుత్వం'లో ప్రజలు వైసిపి రాష్ట్ర యువ నాయకులు వై.ప్రదీప్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. బుధవారం ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. వారానికోసారి తాగునీరు వస్తున్నాయని, అనేక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు విన్నవించారు. రోడ్డు సమస్యతోపాటు డ్రెయినేజీ వ్యవస్థ కూడా అస్తవ్యస్తంగా ఉందని తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం ప్రదీప్ రెడ్డి స్పందిస్తూ... హనువాల్ వాటర్ స్కీం ద్వారా తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నా రు. ఈ సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక పైపులైన్ కోసం నిధులు మంజూరయ్యాయని తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభించి తాగునీటి సమస్య లేకుండా చేస్తామన్నారు. డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని అధికారులకు తెలిపారు. అర్హులకు పథకాలు అందించడానికి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కృషి చేస్తున్నారన్నారు.వైసిపి మండల నాయకులు దేశాయి ప్రహ్లాద చారి, ఏకం రెడ్డి, రామన్న గౌడ్, చెన్నప్ప, ఎంపిపి అమ్రేష్, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, శివరాం, బసవన్న గౌడ్, మల్లి, సిద్ధరామ, ఎంపిడిఒ జగన్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్య చూపుతున్న ప్రజలు

మహారాజశ్రీ కర్నూలు ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో
ఓ. యస్. నెం.1157/2021
పి.మౌలాలి.
...వాది
-ఎదురి -
బి.బాలకృష్ణ తండ్రి లేటు బాల నాగిశెట్టి వ్యాపారము, ఇంటి. నెం.78-27-బి-1, కృష్ణా నగర్, కర్నూలు.
...ప్రతివాది
ప్రతి వాదికి దావా సమన్సు
పై నంబరు దావాలో వాది, ప్రతివాది నుండి దావా మొత్తము రూ.4,84,000/-లు ఇందుపైన ముందు వడ్డీ, మరియు కోర్టు ఖర్చులు రాగోరి దావా దాఖలు చేసినాడు. ఇందులో ప్రతివాది అయిన నీకు ఆక్షేపణం ఉన్న 04-5- 2023వ తేదీ పగలు 10:30 గంటలకు పైకోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేని ఎడల నీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా : 04-5-2023
హెచ్.కె. జలంధర్ రావు,
జి.గోపాలకృష్ణయ్య,
డి.మహమ్మద్ రఫీ,
పి.సత్యనారాయణ రెడ్డి,

మహారాజశ్రీ గుంతకల్లు జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
O.S.No.50/2020
Between:
డి.శ్రీనివాసులు ...వాది
మరియు
1.బి.ప్రహ్లాద శెట్టి died by his LRs
2.శ్రీమతి బి.వాసవి
3.చంద్రలేఖ
4.బి.పృధ్వి
5.బింధు మాధవి ...ప్రతివాదులు
To
2.శ్రీమతి బి.వాసవి, భర్త లేట్ బి.ప్రహ్లాద శెట్టి, వయస్సు 45 సం॥లు, రామదుర్గం గ్రామం & పోస్ట్, చిప్పగిరి మండలం, కర్నూలు జిల్లా.
3.చంద్రలేఖ, తండ్రి లేట్ బి.ప్రహ్లాద శెట్టి, వయస్సు: 28 సం॥లు, రామదుర్గం గ్రామం & పోస్ట్, చిప్పగిరి మండలం, కర్నూలు జిల్లా.
4.బి.పృధ్వి తండ్రి లేట్ బి.ప్రహ్లాద శెట్టి, వయస్సు: 25 సం॥లు, రామదుర్గం గ్రామం & పోస్ట్, చిప్పగిరి మండలం, కర్నూలు జిల్లా.
5.బిందు మాధవి తండ్రి లేట్ బి.ప్రహ్లాద శెట్టి, వయస్సు: 22 సం॥లు, రామదుర్గం గ్రామం & పోస్ట్, చిప్పగిరి మండలం, కర్నూలు జిల్లా.
ప్రతివాదులకు దావా సమను
పై దావాను వాది మీ అందరిపైన ప్రాంసరీ నోట్లు బాకీ రాబట్టుకొను నిమిత్తం దాఖలు చేసినాడు. పై దావా నీ యొక్క హాజరు కొరకు వాయిదా 24-04-2023 తేదిన వేయబడినది. కావున మీ కేమైనా ఆక్షేపణలున్న యెడల పై తేదిన ఉదయం 10.30 గంటలకు పై కోర్టు నందు స్వతహాగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై తెలుపుకొనచ్చును.. అట్లు లేనియెడల దావా మీ పరోక్షమందు తీర్మానము చేయబడును.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది:24-04-2023.
డి.నూర్ మొహమ్మద్, ఎస్.ఇదురువలి
వాదితరుపు వకీలు, గుంతకల్లు.

మహారాజ శ్రీ కర్నూలు మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో
ఐ. ఏ. నెం. 205/2021 ఇన్ ఓ. యస్. నెం.1154/2021
సి.జి.లక్ష్మీదేవి. ...అర్జీదారు/వాది
-ఎదురి -
బి.బాలకృష్ణ తండ్రి లేటు బాల నాగిశెట్టి వ్యాపారము, ఇంటి. నెం.78-27-బి-1, కృష్ణా నగర్, కర్నూలు.
...రెస్పాండెంటు /ప్రతివాది
రెస్పాండెంటు /ప్రతి వాదికి నోటీసు
పై నంబరు దావాలో వాది, ప్రతివాది నుండి దావా మొత్తము వగైరాలు రాగోరి దావా దాఖలు చేస్తూ దావా బాకీ కి పూఛీ గా షెడ్యూల్ ఆస్తిని హెూల్ జప్తి కోరినాడు. ఇందులో రెస్పాండెంటు /ప్రతివాది అయిన నీకు ఆక్షేపణం ఉన్న 17-5- 2023వ తేదీ పగలు 10:30 గంటలకు పైకోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేని ఎడల నీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.
షెడ్యూలు :-
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, ఉదయగిరి సబ్- రిజిస్ట్రేషన్ జిల్లా. మర్రిపాడు మండలం, భూధవాడ గ్రామం, సర్వే.నెంబర్.671 లో ఎకరం 0.22 సెంట్ల భూమి, సెరిమెట్ట భూమి.
తూర్పు : అనిల్ కుమార్ భూమి. పడమర: బండి రస్తా.
ఉత్తరం :రెస్పాండెంట్ యొక్క మిగిలిన భూమి i.e.రాజా రూరల్ అగ్రికల్చరల్ డెవలప్మెంట్ సొసైటీ, దక్షిణం:సర్దార్ పార్థ పాల్ సింగ్ భూమి.
మార్కెట్ విలువ:రూ.4,00,000/- లు
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా : 17-5-2023
హెచ్.కె.జలంధర్ రావు,
జి.గోపాలకృష్ణయ్య,
డి.మహమ్మద్ రఫీ,
పి.సత్యనారాయణ రెడ్డి,
అర్జిదారు పరం న్యాయవాదులు, కర్నూలు.

మహారాజశ్రీ కర్నూలు మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో
ఐ. ఏ. నెం.206/2021 ఇన్ ఓ. యస్. నెం.1159/2021
సి.జి.లావణ్య. ...అర్జీదారు /వాది
-ఎదురి -
బి.బాలకృష్ణ తండ్రి లేటు బాల నాగిశెట్టి వ్యాపారము, ఇంటి. నెం.78-27-బి-1, కృష్ణా నగర్, కర్నూలు.
...రెస్పాండెంట్ /ప్రతివాది
రెస్పాండెంట్ /ప్రతి వాదికి నోటీసులు
పై నంబరు దావాలో వాది, ప్రతివాది నుండి దావా మొత్తము వగైరాలు రాబట్టు కొనుటకు దావా దాఖలు చేస్తూ, దావా బాకీ కి పూచికత్తుగా షెడ్యూల్ ఆస్తిని హెూల్ జప్తి కోరినాడు. ఇందుపైన రెస్పాండెంట్ అయిన నీకు ఆక్షేపణ ఉన్న 17-5- 2023వ తేదీ పగలు 10:30 గంటలకు పైకోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేని ఎడల నీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.
షెడ్యూలు :-
కర్నూలు డి., కర్నూలు సబ్ -డి, దూపాడు గ్రామం, న్యూ సస్ రైల్ కాలనీ, లక్ష్మీపురం గ్రామపంచాయతీ సర్వే.నెంబర్.183ఎ, ప్లాట్. నెం.22.
తూర్పు : ప్లాట్ నెంబర్. 23.
పడమర: ప్లాట్ నెంబర్.21. ఉత్తరం :30 అడుగుల రోడ్డు.
దక్షిణం: ఇతరుల భూమి
మార్కెట్ విలువ :రూ.2,00,000/-లు
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా :17-5-2023
హెచ్.కె. జలంధర్ రావు,
జి.గోపాలకృష్ణయ్య,
డి.మహమ్మద్ రఫీ,
పి.సత్యనారాయణ రెడ్డి,
వాది పరం అడ్వకేట్లు, కర్నూలు.

మహారాజశ్రీ కర్నూలు మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో
ఓ. యస్.నెం.1154/2021
సి.జి.లక్ష్మీదేవి. ...వాది
-ఎదురి -
బి.బాలకృష్ణ తండ్రి లేటు బాల నాగిశెట్టి వ్యాపారము, ఇంటి. నెం.78-27-బి-1, కృష్ణా నగర్, కర్నూలు.
...ప్రతివాది
ప్రతి వాదికి దావా సమన్సు
పై నంబరు దావాలో వాది, ప్రతివాది నుండి దావా మొత్తము రూ.3,43,733/-లు ఇందుపైన ముందు వడ్డీ, మరియు కోర్టు ఖర్చులు రాగోరి దావా దాఖలు చేసినాడు. ఇందులో ప్రతివాది అయిన నీకు ఆక్షేపణ ఉన్న 17-5- 2023వ తేదీ పగలు 10:30 గంటలకు పైకోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేని ఎడల నీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా :17-5-2023
హెచ్.కె. జలంధర్ రావు,
జి.గోపాలకృష్ణయ్య,
డి.మహమ్మద్ రఫీ,
పి.సత్యనారాయణ రెడ్డి,
వాది పరం అడ్వకేట్లు, కర్నూలు.

మహారాజశ్రీ కర్నూలు మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో
ఓ. యస్.నెం.1159/2021
సి.జి.లావణ్య. ...వాది
-ఎదురి -
బి.బాలకృష్ణ తండ్రి లేటు బాల నాగిశెట్టి వ్యాపారము, ఇంటి. నెం.78-27-బి-1, కృష్ణా నగర్, కర్నూలు.
...ప్రతివాది
ప్రతి వాదికి దావా సమన్సు
పై నంబరు దావాలో వాది, ప్రతివాది నుండి దావా మొత్తము రూ.3,43,733/-లు ఇందుపైన ముందు వడ్డీ, మరియు కోర్టు ఖర్చులు రాగోరి దావా దాఖలు చేసినాడు. ఇందులో ప్రతివాది అయిన నీకు ఆక్షేపణ ఉన్న 17-5- 2023వ తేదీ పగలు 10:30 గంటలకు పైకోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేని ఎడల నీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా :17-5-2023
హెచ్.కె. జలంధర్ రావు,
జి.గోపాలకృష్ణయ్య,
డి.మహమ్మద్ రఫీ,
పి.సత్యనారాయణ రెడ్డి,
వాది పరం అడ్వకేట్లు, కర్నూలు.

మహారాజశ్రీ కర్నూలు ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో
ఐ. ఏ. నెం.284/2021 ఇన్ ఓ. యస్. నెం.1157/2021
పి.మౌలాలి. ...వాది
-ఎదురి -
బి.బాలకృష్ణ తండ్రి లేటు బాల నాగిశెట్టి వ్యాపారము, ఇంటి. నెం.78-27-బి-1, కృష్ణా నగర్, కర్నూలు.
...రెస్పాండెంట్ /ప్రతివాది
రెస్పాండెంటు /ప్రతి వాదికి నోటీసు
పై నంబరు దావాలో వాది, ప్రతివాది నుండి దావా మొత్తము వగైరాలు రాగోరి దావా దాఖలు చేస్తూ దావా బాకీ కి పూఛీ గా షెడ్యూల్ ఆస్తిని హెూల్ జప్తి కోరినాడు. ఇందులో రెస్పాండెంటు /ప్రతివాది అయిన నీకు ఆక్షేపణ ఉన్న 04-05- 2023వ తేదీ పగలు 10:30 గంటలకు పైకోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేని ఎడల నీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.
షెడ్యూలు :-
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, ఉదయగిరి సబ్- రిజిస్ట్రేషన్ జిల్లా. మర్రిపాడు మండలం, భూధవాడ గ్రామం, సర్వే.నెంబర్.671 లో ఎకరం 0. 22 సెంట్ల భూమి, సెరిమెట్ట భూమి.
తూర్పు :అనిల్ కుమార్ భూమి. పడమర: బండి రస్తా.
ఉత్తరం :రెస్పాండెంట్ యొక్క మిగిలిన భూమి i.e.రాజా రూరల్ అగ్రికల్చరల్ డెవలప్మెంట్ సొసైటీ.
దక్షిణం :సర్దార్ పార్థ పాల్ సింగ్ భూమి.
మార్కెట్ విలువ:రూ.4,00,000/-లు
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా :04-05-2023
హెచ్.కె. జలంధర్ రావు,
జి.గోపాలకృష్ణయ్య,
డి.మహమ్మద్ రఫీ,
పి.సత్యనారాయణ రెడ్డి,
అర్జీదారు పరం న్యాయవాదులు, కర్నూలు.

ప్రచార భేరి కార్యక్రమంలో మాట్లాడుతున్న వామపక్ష నాయకులు

అభ్యర్థులు వీరేనా..?

- యువగళంలో లోకేష్ హింట్ ఇచ్చారా..?
- టిడిపి శ్రేణుల్లో మొదలైన చర్చ

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

రాబోయే ఎన్నికల్లో టిడిపి తరపున పోటీ చేసే అభ్యర్థులు వారేనా..? యువగళం పాదయాత్రలో నారా లోకేష్ హింట్ ఇస్తున్నారా? ప్రస్తుతం జిల్లాలోని టిడిపి శ్రేణుల్లో ఇదే చర్చ నడుస్తోంది...

సార్వత్రిక ఎన్నికలకు ఇంకా సంవత్సరం మాత్రమే సమయం ఉంది. అదే సందర్భంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర చేపట్టారు. ఆ యాత్ర ఇప్పటికే 75 రోజులు పూర్తి చేసుకుంది. ఈ పాదయాత్రలో ప్రతి నియోజకవర్గంలో ఒక బహిరంగ సభ నిర్వహిస్తున్నారు. ఈ సభలో లోకేష్ మాట్లాడటం పూర్తయిన తరువాత లోకేష్ ఒకరి చేయి పైకెత్తి నినాదాలు చేయిస్తున్నారు. దీనిపై జిల్లా టిడిపి శ్రేణుల్లో చర్చ మొదలైంది. ప్యాపిలి మండలంలోని సభలో ధర్మవరం సుబ్బారెడ్డి, తుగ్గలి మండలంలోని సభలో కెఇ.శ్యాంబాబు, ఆస్పరి మండలంలోని సభలో కోట్ల సుజాతమ్మ చేతిని లోకేష్ ఎత్తి పిడికిలి బిగించి చూపించారు. దీంతో వారే రాబోయే ఎన్నికల్లో టిడిపి తరపున పోటీ చేసే అభ్యర్థులు అంటూ టిడిపి నాయకులు చర్చించు కుంటున్నారు. గతంలో ప్యాపిలి మండలం జలదుర్గంలో ఏర్పాటు చేసిన బాదుడే బాదుడు కార్యక్రమంలో టిడిపి అధినేత చంద్రబాబు డోన్ టిడిపి అభ్యర్థిగా ధర్మవరం సుబ్బారెడ్డి పేరును ప్రకటించారు. అయితే యువగళంలో ఆయనకు వ్యతిరేకంగా కరపత్రాలు బయటపడ్డాయి. ఆయన వైసిపి కోవర్టులా పని చేస్తున్నారని, పార్టీకి నష్టం జరుగుతుందని ఆ కరపత్రాల్లో పేర్కొన్నారు. ఆలూరు నియోజక వర్గానికి సంబంధించి కోట్ల సుజాతమ్మతో పాటు వైకుంఠం ప్రసాద్, వైకుంఠం మల్లికార్జున కూడా టిడిపి టికెట్‌ను ఆశిస్తున్నారు. యువగళం సభలో లోకేష్ సుజాతమ్మనే టిడిపి అభ్యర్థిగా ఖరారు చేశారన్న వార్తలు వినిపిస్తున్నాయి. అయితే అదేం లేదని పార్టీ అధినేత టికెట్లను ఖరారు చేస్తారనే వాదన కూడా టిడిపి వర్గాల్లో వినిపిస్తోంది. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి టికెట్ ఎవరికి దక్కుతుందో ఎదురు చూడాల్సిందే..

ప్రైవేటుకు అప్పనంగా ప్రభుత్వ సంస్థలు

- మోడీ నిరంకుశ పాలనపై ఉద్యమించాలి
- ప్రచార భేరిలో సిపిఎం, సిపిఐ నాయకులు

ప్రజాశక్తి - నంద్యాల

కేంద్రంలోని ప్రధాని మోడీ లాభాల బాటలో నడుస్తున్న ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ వారికి ధారాదత్తం చేయడానికి పూనుకున్నారని సిపిఎం, సిపిఐ నాయకులు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం, సిపిఐ జాతీయ సమితి పిలుపు మేరకు బుధవారం నంద్యాలలో ఆరవ రోజు బైర్మల్ వీధి, అమ్మవారి శాల,రోజా కుంట, ఏరియాలలో ప్రచార భేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి కె.ప్రసాద్, సహాయ కార్యదర్శి జి.సోమన్న, సిపిఎం పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహులు, సీనియర్ నాయకులు తోట మద్దులు మాట్లాడారు. ఎపిలో విశాఖ ఉక్కును ప్రైవేటు వారికి అప్పనంగా అప్పజెప్పే ప్రయత్నం జరుగుతుందన్నారు. రాష్ట్రానికి విభజన సమయంలో ఇచ్చిన హామీలు ఏమాత్రం నెరవేర్చకుండా రాష్ట్ర ప్రజలను మోడీ మోసం చేశారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని, రానున్న ఎన్నికల్లో బిజెపికి తగిన బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి గౌస్, అధ్యక్షులు లక్ష్మణ్, నాయకులు వెంకట లింగం, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ధనుంజయ్, జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రిస్వామి, ఏఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి విష్ణు, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు లక్ష్మణ్, శివ తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూర్ :** దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ప్రతి వ్యక్తి కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను నిలదీయాల్సిన సమయం వచ్చిందని సిపిఎం, సిపిఐ నాయకులు పేర్కొన్నారు. రెండవరోజు ప్రచార యాత్ర సంగమేశ్వర సర్కిల్ నుంచి వెంగల్ రెడ్డి నగర్, అర్బన్ కాలనీ, వీరభద్ర ఏరియా, పద్మావతి స్కూల్ ఏరియా, తోటగేరి మీదుగా గాంధీ బొమ్మ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబా పకర్దీన్, సిపిఎం పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్, పట్టణ నాయకులు ఎస్. స్వాములు, సిపిఐ కార్యదర్శి కె. శ్రీనివాసులు మాట్లాడారు. సిపిఎం నాయకులు షైక్ ఇస్మాయిల్, రామ్ నాయక్, సద్దాం హుస్సేన్, దినేష్, వీరన్న, నూర్ గణపతి శివుడు, రాముడు, సిపిఐ నాయకులు వెంకట శివుడు ప్రసాద్ ప్రతాప్, ఓబులేసు, తాజుద్దీన్, మల్లయ్య, మహిళా సమాఖ్య నాయకురాలు స్వాతి పాల్గొన్నారు. **పాణ్యం :** పాణ్యం బస్టాండ్ ఏరియాలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రచార భేరి కార్యక్రమం నిర్వహించారు. గడపగడపకు, షాపులు తిరిగి కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. సిపిఎం మండల నాయకులు కె.భాస్కర్, కెజె.శ్రీనివాసరావు, దేవరాజు, బత్తిని ప్రతాప్, చంద్రబాబు, ఆటో, హమాలీ కార్మికులు నాగరాజు, వెంకట్, చంద్ర పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం అధ్వాన పరిస్థితిలో వుందని, ఇఒఆర్డీలు, పంచాయతీ సెక్రెటరీలు ప్రత్యేక దృష్టి సారించి మెరుగుపరచాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో పారిశుధ్య మెరుగుదల, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల వినియోగంపై ఈవోఆర్డీలతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో మురుగు, చెత్తాచెదారం అధ్వాన రీతిలో ఉన్నట్లు ప్రతిరోజు పత్రికల్లో వస్తున్నప్పటికీ సంబంధిత ఈవోఆర్డీలు, పంచాయతీ సెక్రటరీలు ఏమాత్రం శ్రద్ధ చూపక నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈవోఆర్డీలు పనితీరు మెరుగుపరుచుకుని పారిశుధ్య చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే తాగునీటికి ఇబ్బంది లేకుండా పైప్‌లైన్, మోటార్ మరమ్మతుల పనులు చేపట్టాలన్నారు. చేతి పంపుల రిపేర్లు చేయడంతో పాటు బోర్లకు డీపనింగ్, ఫ్లెషింగ్ పనులు ఎప్పటికప్పుడు చేయించాలని ఆదేశించారు. అన్ని మండలాలలో చెత్త నుండి సంపద తయారు చేసే కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి పెండింగులో ఉన్న షెడ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. గత రెండు సంవత్సరాల నుండి సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ షెడ్ల నిర్మాణ పనులు నత్తనడకన సాగడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేస్తూ ఈఓఆర్డిలు తమ దృక్పథాన్ని మార్చుకొని షెడ్ల నిర్మాణం పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. స్థల, స్థానిక సమస్యలు ఎదురైతే సంబంధిత తహశీల్దార్, సర్పంచ్‌లను సంప్రదించి పరిష్కరించుకోవాలని సూచించారు. గ్రామంలో చెత్త చెదారం తొలగించి వాటిని సంపద తయారీ కేంద్రాల్లో ఎరువుగా మార్చడం వల్ల గ్రామపంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని అన్నారు. మరోవైపు గ్రామాల్లో కూడా పారిశుధ్యం మెరుగవుతుందని తెలిపారు. నిధులు లేవని, స్థల సమస్య ఉందని కారణాలు చెప్పి తప్పించుకోవడం సరికాదని, నిర్ణీత గడువులో బిల్లులు అప్లోడ్ చేస్తే నిధులు మంజూరు అవుతున్నాయని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసులు, డివిజనల్ పంచాయతీ అధికారులు, డ్వామా ఎపిడి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

రంజాన్ వేళలు

గురువారం
ఇఫ్తార్ : 6 : 39

శుక్రవారం
సహేరి : 4 : 35

చిన్న, సన్న కారు రైతుల

భూములు లాక్కుంటున్నారు

- అధికార పార్టీ అనునాయుల ఆస్తులను కాపాడేందుకే..
- గ్రామ సభ ద్వారా అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలి
- ప్రత్యామ్నాయ భూముల్లో జాతీయ రహదారి నిర్మించండి - ఎపి రైతు సంఘం, సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల నుండి జమ్మలమడుగు వరకు జాతీయ రహదారి నిర్మాణంలో అధికార పార్టీ అనునాయుల ఆస్తులను కాపాడేందుకు చిన్న, సన్న కారు రైతుల భూములు లాక్కుంటున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ.రాజశేఖర్, జిల్లా సహాయ కార్యదర్శి టి.రామచంద్రుడులు అన్నారు. బుధవారం సిపిఎం, ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో కానాల, రైతు నగరం గ్రామాల్లో జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులను కలిసి వారి పొలాలను పరిశీలించారు. రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. 'మేము కేవలం ఎకరా, రెండు ఎకరాల భూమి కలిగిన పేద రైతులం. మాకు జీవనాధారంగా ఉన్న ఆ కొంత భూమిని ప్రభుత్వ అధికారులు మాకు ఏ మాత్రం చెప్పకుండా, మా అభిప్రాయాలను తెలుసుకోకుండా, గ్రామ సభ జరపకుండా మా భూముల్లో రహదారి కోసం మార్కింగ్ వేస్తున్నారు. మొదట్లో మా గ్రామంలో రహదారి కోసం చేసిన ప్లాన్ ప్రకారం కాకుండా మరో ప్లాన్ ప్రకారం గజిట్ ప్రకటించారు. గజిట్‌పై మా అభ్యంతరాలను భూ సేకరణ అధికారులకు అనేకమార్లు విన్నవించుకున్నాం. అయినా ఏ మాత్రం పట్టించుకోకుండా నేడు మార్కింగ్ ఇస్తున్నారు. భూమిని కోల్పోతే ఆత్మహత్యే శరణ్యం..' అంటూ రైతులు ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం, రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ నంద్యాల నుండి జమ్మలమడుగు వరకు జాతీయ రహదారి నిర్మాణం కోసం ప్రభుత్వం చేపడుతున్న భూ సేకరణలో గజట్ నోటిఫికేషన్ ప్రకారం కానాల, రైతు నగరం గ్రామాల్లోని పేద మధ్యతరగతి రైతుల భూములు ఎక్కువగా కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కేవలం కొంతమంది ధనవంతులు, అధికార పార్టీ అనునాయుల ఆస్తులను కాపాడేందుకు కోసం ప్రభుత్వం భూ సేకరణ చేస్తుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకొని కానాల గ్రామంలో గ్రామ సభ నిర్వహించి, రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. పేద మధ్యతరగతి రైతులకు నష్టం జరగకుండా ప్రత్యామ్నాయ మార్గంలో భూ సేకరణ చేపట్టాలని కోరారు. ప్రజాభిప్రాయం మేరకు జరగని పక్షంలో ఆయా గ్రామాల రైతులతో కలిసి మార్కింగ్ పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. అధికార పార్టీ నాయకుల, ప్రజా ప్రతినిధుల, రియల్ ఎస్టేట్ వ్యాపారస్తుల ఆస్తులు కాపాడేందుకు కోసం పేదల భూములు రహదారుల కోసం లాక్కొని వారి కడుపులు కొట్టొద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు హుస్సేన్ వలి, యూసఫ్, రైతులు మురళీకృష్ణ శర్మ, శంకర్రావు, వెంకటరామిరెడ్డి, గంగాధర్ రెడ్డి, టి.వెంకటేశ్వర్లు, రామ చిన్నమ్మ, భూ బాధిత రైతులు, మహిళలు పాల్గొన్నారు.

బాధిత రైతుల పొలాలను పరిశీలిస్తున్న నాయకులు

మాజీ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్లో బుధవారం నియోజకవర్గంలోని ముస్లిం సోదరులకు మాజీ శాసనమండలి విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్ర రెడ్డిలు ఇఫ్తార్ విందును ఇచ్చారు. ఈ సందర్భంగా వారు ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లిం సోదరులతో కలిసి విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ బాబూలాల్, ఎంపిపి గజ్జల రాఘవేంద్రారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, మాజీ వైస్ చైర్మన్ గోపవరం నరసింహారెడ్డి, విజయ డైరీ డైరెక్టర్ గంగుల విజయసింహారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్ రసూల్, కౌన్సిలర్ గొట్లూరు సుధాకర్ రెడ్డి, కాంట్రాక్టర్ నజీర్, విజయ మిల్క్ డైరీ చైర్మన్ ఎస్వీ జగన్ మోహన్ రెడ్డి, అమీర్ భాష, చాగలమర్రి మాజీ సర్పంచ్ సోహైల్, ముల్లా ఖాదర్ భాష, గూబగుండం వెంకట సుబ్బారెడ్డి, వైసిపి కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

కౌలూరులో దొంగల బీభత్సం

ప్రజాశక్తి - పాణ్యం

మండలంలోని కౌలూరు గ్రామంలో తెల్లవారుజామున దొంగలు బీభత్సం సృష్టించి రెండిళ్లలో దొంగతనాలకు పాల్పడ్డాడరు. ఎస్ఐ సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. కౌలూరు గ్రామానికి చెందిన మంగలి జ్యోతి, మంగలి ఎల్లా కృష్ణుడు ఇంట్లో దొంగలు జొరబడి బీరువా పగలగొట్టి సుమారు 5 తులాల బంగారం దొంగలించారు. క్లూస్ టీం సహాయంతో ఎస్ఐ సుధాకర్ రెడ్డి దొంగతనాలకు పాల్పడిన వారి వేలి ముద్రలను సేకరించారు. మంగలి జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

మహానంది ఎస్ఐగా జి.నాగేంద్ర ప్రసాద్ బాధ్యతలు

ప్రజాశక్తి - మహానంది

మహానంది మండల నూతన ఎస్సైగా జి.నాగేంద్ర ప్రసాద్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఎస్సైగా బాధ్యతలు నిర్వహిస్తున్న నాగార్జున రెడ్డిని విఆర్‌కు బదిలీ చేశారు. ప్రస్తుత నూతన ఎస్ఐ జి.నాగేంద్ర ప్రసాద్ మద్దికెర నుంచి బదిలీపై వచ్చారు. ముందుగా ఎస్ఐ మహానంది క్షేత్రంలోని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకురాలిపై హెచ్ఎం దాడి

- కోడి గుడ్డు విషయంలో వాదన
- తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఇరువురు ఫిర్యాదు

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్నం అందించే భోజనంలో కోడిగుడ్డు విషయంలో వాదన పెరిగి మధ్యాహ్న భోజన నిర్వాహకురాలిపై ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ దాడి చేసి గాయపరిచిన సంఘటన బుధవారం నంద్యాల మండలం చాబోలులో చోటు చేసుకుంది. వివరాలు.. చాబోలులోని హరిజన వాడలో ఉన్న స్పెషల్ పాఠశాలలో రోజులాగే మధ్యాహ్నం భోజనం తయారు చేసి విద్యార్థులకు వడ్డిస్తుండగా ఓ విద్యార్థికి పూర్తిగా గుడ్డు వేయకుండా కేవలం సోన మాత్రమే వేశారని హెచ్ఎం దృష్టికి విద్యార్థి తీసుకెళ్లాడు. ఈ విషయంపై వంట మనిషి తనకు చెబితే వేరే గుడ్డు ఇచ్చేవారమని చెప్పింది. అక్కడికి వచ్చిన హెచ్ఎం వంట మనిషి వెంకట శివలక్ష్మి పట్ల అసభ్యకరమైన పదజాలం వాడటంతో ఇరువురి మధ్య వాగ్వివాదం పెరిగింది. హెచ్ఎం తను చెప్పినట్లే వినాలని, లేకుంటే తొలగిస్తానని గట్టిగా అరుస్తూ చెప్పుతో దాడి చేశాడని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. బాధితురాలు, హెచ్ఎం ఇద్దరూ ఒకరిపై ఒకరు నంద్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై ఎంఇఒ బ్రహ్మంను విచారణ అధికారిగా డిఇఒ నియమించారు. గురువారం పాఠశాలకు వెళ్లి పూర్తి వివరాలతో నివేదిక అందించాలని ఎంఇఒను ఆదేశించారు.

హెచ్ఎంను సస్పెండ్ చేయాలి : సిఐటియు

వంట మనిషి వెంకట శివలక్ష్మిపై దాడి చేసి గాయపరిచిన హెచ్ఎం రవి కుమార్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని, కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సిఐటియు నంద్యాల పట్టణ కార్యదర్శి కెఎండి గౌస్, ఎపి మధ్యాహ్నం భోజన పథకం కార్మిక సంఘం కార్యదర్శి ఈశ్వరమ్మ లు డిమాండ్ చేశారు. మహిళా అని కూడా చూడకుండా అసభ్యకర పదజాలం వాడుతూ చెప్పుతో కొట్టి, రవికను చించడం దుర్మార్గమన్నారు. జిల్లా విద్యాధికారులు స్పందించి తక్షణమే హెచ్ఎంపై చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రతి ఎకరాకూ సాగునీరు అందిస్తాం : వైసిపి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

తెలుగు గంగ ప్రాజెక్టు కింద బండి ఆత్మకూరు మండలంలో సాగు చేసిన వరి పొలాలకు సాగునీరు అందిస్తామని వైసిపి శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త శిల్ప భువనేశ్వర్ రెడ్డి తెలిపారు. బుధవారం బండి ఆత్మకూరు మండలంలో వరి సాగు చేసిన రైతులను కలిసి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. రామాపురం, లింగాపురం, సంత జూటూరు గ్రామాల రైతులు సాగు చేసిన వరి పొలాలకు అవసరమైన సాగునీరు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తెలుగు గంగ వెంకటేశ్వర్లు, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు దేరెడ్డి చిన్న సంజీవ రెడ్డి, మాజీ మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు దేసు వెంకటరామిరెడ్డి, జెసిఎస్ అధ్యక్షుడు ముడిమేల పుల్లారెడ్డి రెడ్డి, చిన్న సంజీవరెడ్డి, నాయకులు శివశంకర్, రఘునాథరెడ్డి, లింగాపురం కృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి రైతులు పాల్గొన్నారు.

సాగునీరు గురించి రైతులని అడిగి తెలుసుకుంటున్న శిల్పా భువనేశ్వర్ రెడ్డి

పొదుపు మహిళలతో విచారిస్తున్న ఎపిఎం

పొదుపు చెంచు మహిళలకు న్యాయం చేస్తాం

- వెలుగు ఎపిఎం ప్రసాద్

ప్రజాశక్తి - రుద్రవరం

పొదుపు చెంచు మహిళల సొమ్ము కాజేసిన వివోఏ తిరుపాలు నుంచి నగదు రికవరీ చేసి న్యాయం చేస్తామని వెలుగు ఏపిఎం ప్రసాద్ తెలిపారు. బుధవారం ప్రజాశక్తి దినపత్రికలో 'వెలుగు సిబ్బంది మోసం చేశారు' శీర్షికన వెలువడిన వార్తకు వెలుగు అధికారులు స్పందించారు. రుద్రవరం వెలుగు ఏపిఎం ప్రసాద్, సిసి చంద్రపాల్‌ను హరినగరం గ్రామం పంపి సంఘటనపై విచారణ జరిపించారు. ఈ సంఘటనపై వెలుగు ఎపిఎం మాట్లాడుతూ 3 పొదుపు గ్రూపులను విచారించామన్నారు. ఇందులో వెన్నెల గ్రూపు రూ. 45 వేల 215 శ్రీనిధికి చెల్లించాల్సి ఉందన్నారు. ఆ మొత్తాన్ని సభ్యులు చెల్లిస్తామని ఒప్పుకున్నారన్నారు. మిగిలిన రెండు గ్రూపులకు సంబంధించి దాదాపు రూ 70,000 వివోఏ తిరుపాలు వాడుకున్నందున ఆ మొత్తాన్ని అతని నుంచి రికవరీ చేస్తామన్నారు. ఈ విచారణలో పొదుపు మహిళలు, సిబ్బంది పాల్గొన్నారు.

అడుగులు వేస్తూ.. సమస్యలు వింటూ..

- ఆస్పరి మండలంలో యువగళం పాదయాత్ర
- రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం : లోకేష్

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/ఆస్పరి

అడుగడుగునా సమస్యలు వింటూ టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ముందుకు సాగారు. ఆయన చేపట్టిన యువగళం పాదయాత్ర బుధవారం ఆస్పరి మండలంలో సాగింది. వలగొండ క్రాస్ నుంచి ప్రారంభమైంది. వలగొండ, పుప్పులదొడ్డి, కైరుప్పల, వెంగళదొడ్డి క్రాస్, కారుమంచి, ములుగుందం వరకూ సాగింది. తుమ్మలవంకపై వర్షాకాలంలో ప్రయాణించలేక ఇబ్బందులు పడుతున్నామని, బ్రిడ్జిని నిర్మించాలని వలగొండ గ్రామస్తులు లోకేష్‌కు విన్నవించారు. వ్యవసాయంలో నష్టం రావడంతో తన భర్త గత నెల 31న ఆత్మహత్య చేసుకున్నాడని, బాకీ తీర్చాలని అప్పులవాళ్లు ఒత్తిడి చేస్తున్నారని, కలెక్టర్‌ను కలిసినా పరిహారం అందలేదని చిరుమానుదొడ్డికి చెందని ఖాసింబీ లోకేష్ ఎదుట కన్నీటి పర్యంతమైంది. పరిహారం కోసం ప్రభుత్వానికి లేఖ రాస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. పుప్పులదొడ్డిలో యాదవులు లోకేష్‌ను కలిసారు. గొర్రెల కాపరులకు 50 ఏళ్ల పెన్షన్ ఇవ్వాలని, గొర్రెలతో పాటు ఆవులను కూడా రాయితీపై అందించి వాటికీ ఇన్సూరెన్స్ కల్పించాలని కోరారు. వెంగలాయదొడ్డి చెరువు నిండకపోవడం వల్ల పొలాలు బీడుగా మారుతున్నాయని, లిఫ్ట్ ఇరిగేషన్ పెట్టాలని కైరుప్పల గ్రామస్తులు లోకేష్‌కు విన్నవించారు. కారుమంచిలో బిసి సామాజికవర్గం ప్రతినిధులతో లోకేష్ ముఖాముఖి నిర్వహించారు. బెంజి మంత్రి వాల్మీకులకు చేసింది ఏంటని ప్రశ్నించారు. ఇట్టినా భూములను తాను కొంటానని సవాల్ విసిరానని, ఆ భూములు రైతుల పేరిట రాయడానికి మంత్రి సిద్ధమా అని ప్రశ్నించారు. బిసిలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కారుమంచి మధ్యాహ్న విడిది కేంద్రంలో ప్రజలతో సెల్ఫీలు దిగారు. కారుమంచి శివార్లలో పొలం పనులు చేసుకుంటున్న ఓ రైతు వద్దకు వెళ్లి అరక దున్నుతూ రైతు కష్టాలు తెలుసుకున్నారు. టిడిపి అధికారంలోకి రాగానే అన్నదాతలను అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. తమ గ్రామంలో తాగునీటి ఎద్దడి అధికంగా ఉందని, డ్రైనేజీలు, సిసి రోడ్లు లేవని కారుమంచి గ్రామస్తులు లోకేష్ దృష్టికి తీసుకొచ్చారు. ములుగుందం సర్పంచి, ఎంపిటిసి లోకేష్‌ను కలిసి తమ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. పంచాయతీ ఎన్నికల్లో టిడిపి గెలవడంతో తమ గ్రామంలో రోడ్డు పనులను ఆపేశారని తెలిపారు. రోడ్లు వేయించాలని, సాగునీరు, తాగునీరు అందించాలని కోరారు. ములుగుందం శివార్లలో క్యాంప్ సైట్‌లో బస చేశారు. బుధవారం మొత్తంగా యువగళం పాదయాత్ర 15.5 కిలో మీటర్లు సాగింది. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయసుర్య ప్రకాష్ రెడ్డి, మాజీ మంత్రి భూమా అఖిల ప్రియ, ఆలూరు టీడీపీ ఇంచార్జ్ కోట్ల సుజాతమ్మ, ఆలూరు మాజీ ఇంచార్జ్ వీరభద్ర గౌడ్, వైకుంఠం మల్లి కార్జున, ప్రసాద్, జ్యోతి, ఆస్పరి మాజీ జెడ్పీటీసీ బొజ్జమ్మ, దేవనకొండ మాజీ ఎంపీపీ రామచంద్ర నాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నారా లోకేష్

అనాధ మహిళ మృతి

- 'ఆ నలుగురు' సభ్యులు అంత్యక్రియలు

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచెర్ల పట్టణంలోని ఆర్ఎస్ రంగాపురం రోడ్డు ఓ పాలిష్ ఫ్యాక్టరీలో పని చేస్తూ జీవనం సాగిస్తున్న షేక్ ఇమాంబి(56) బుధవారం అకస్మాత్తుగా కళ్ళు తిరిగి కింద పడిపోవడంతో శేషారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. మృతురాలు షేక్ ఇమాంబి అనాధ కావడంతో ఆసుపత్రి సిబ్బంది, పోలీసు వారు ఆ నలుగురు స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు వన్నూరు భాషకి సమాచారం ఇచ్చారు. వెంటనే ఆ నలుగురు స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు అక్కడికి చేరుకుని అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆ నలుగురు స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు నాగేశ్వర్ రెడ్డి, యూసుఫ్, నాగరాజు, అక్బర్, సద్దాం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఆ నలుగురు స్వచ్ఛంధ సంస్థ సభ్యులు



మొసలిని స్వాధీనం చేసుకున్న అటవీశాఖ అధికారులు

మొసలి స్వాధీనం

ప్రజాశక్తి - గడివేముల

మండలంలోని గని గ్రామ సమీపంలో ఎలికె తండా వెళ్లే రహదారిలో శ్రీధర్‌కు చెందిన బావిలో ఉన్న మొసలిని అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బావిలో మొసలి ఉన్న సమాచారాన్ని అటవీశాఖ అధికారులకు తెలియజేయడంతో వారు అక్కడికి చేరుకున్నారు. బావిలోని నీరును మోటార్ సహాయంతో బయటికి తోడి వల వేసి జెసిబి సహాయంతో మొసలిని బయటకు తీశారు. అటవీ శాఖ అధికారులు మొసలిని స్వాధీనం చేసుకున్నారు.

గౌతు లచ్చన్న ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి - బనగానపల్లె

గౌతు లచ్చన్న ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని గౌడ సంఘం మండల అధ్యక్షులు బుసగౌని వెంకటేశ్వర్లు (దేవుడు) తెలిపారు. బుధవారం పట్టణంలో స్వాతంత్ర సమరయోధులు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న 17వ వర్ధంతి సందర్భంగా గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నాయకులు విజయ్ గౌడ్, సుబ్బారాయుడు గౌడ్,రాముడు గౌడ్, పెద్దనర్సయ్య, చిన్న నరసయ్య, శివయ్య, నాగరాజు,ఎల్లగౌడ్, నాగేంద్ర, తిరుపాల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

ఘనంగా చార్లెస్ రాబర్ట్ డార్విన్ వర్ధంతి

ప్రజాశక్తి - డోన్

డోన్ పట్టణంలోని పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవ పరిణామ వాద సిద్ధాంత కర్త, జీవ శాస్త్రవేత్త చార్లెస్ రాబర్ట్ డార్విన్ వర్ధంతిని హెచ్ఎం పద్మావతమ్మ, సీనియర్ ఉపాధ్యాయులు ఎం.వెంకటసుబ్బారెడ్డిలు బుధవారం నిర్వహించారు. చార్లెస్ రాబర్ట్ డార్విన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డార్విన్ జీవజాలం ఏ విధంగా పరిణామక్రమం చెందినది అనే విషయంపై పరిశోధనలు చేసి, జీవ పరిణామ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు శివ ప్రసాద్, వెంకట రమణ, వెంకటేశ్వర్ గౌడ్, రవిశేఖర్, వెంకటలక్ష్మి, సుబ్బారెడ్డి, లక్ష్మయ్య, చంద్రశేఖర్ గౌడ్, రాధ, మద్దిలేటి, మధుసూదన్ రెడ్డి, శివన్న, శ్రీనివాసులు, జయ సుబ్బారాయుడు, సంజీవరెడ్డి, ఆదినారాయణ, లీలావతమ్మ, శ్రీకళ, సంజీవరెడ్డి, దేవేంద్రప్ప, భాను ప్రకాష్ రెడ్డి, భారతి, రామ్మూర్తి, రాఘవేంద్ర, లక్ష్మి ప్రభావతి, మునిరాజు, అల్లీపీరా తదితరులు పాల్గొన్నారు.

చార్లెస్ రాబర్ట్ డార్విన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

అవగాహన కల్పిస్తున్న

క్షయ, వడ దెబ్బపై అవగాహన

ప్రజాశక్తి - కొత్తపల్లి

కొత్తపల్లి మండలం నాగంపల్లి గ్రామలో ఉపాధి కూలీలకు క్షయవ్యాధి, వడదెబ్బ పై టిబి సూపర్వైజర్ చెరుకు రవికుమార్ బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు, వ్యాధిని గుర్తించే పరీక్షలు, నిర్ధారణ అనంతరం చికిత్స కాలం గూర్చి వివరించారు. పొగాకు, సిగరెట్, మద్యపానం వ్యసనాలు ఉన్నవారికి క్షయవ్యాది సోకే అవకాశం ఉందన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ మద్దిలేటి మాట్లాడుతూ వడదెబ్బ తగలకుండా నీరు, పళ్ల రసాలు, కొబ్బరినీళ్లు, మజ్జిగ ద్రవ పదార్థాలు తీసుకోవాలని చెప్పారు. నలుపు, మందంగా ఉండే వాటికి బదులు లేత రంగుల్లో లభించే తేలికైన కాటన్ దుస్తులు ధరించాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రాజగోపాల్, మేటి, కూలీలు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాల లక్ష్యాన్ని చేరుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : ప్రభుత్వాస్పత్రుల్లో లక్ష్యం మేరకు ప్రసవాలు జరిగేలా పటిష్ట ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ మనజిర్ జిలాని సమూన్ డిఎంహెచ్ఒ, డిసిహెచ్ఎస్, జిల్లా ఆసుపత్రి సూపరిడెంట్‌ను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు, డాక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, డిసిహెచ్ఎస్ డాక్టర్ జఫ్రుల్లా, జిల్లా ఆసుపత్రి సూపరిడెంట్ డాక్టర్ ప్రసాదరావు, అన్ని ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చల్లని నీరు అందించాలి : ఎంపిపి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నపిల్లలకు, గర్భవతులకు, బాలింతలకు చల్లని మంచినీరు అందించాలని ఎంపిపి దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అంగన్వాడీ సూపర్వైజర్లు నజీరా బేగం, రమాదేవి, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి ప్రతి కేంద్రానికి మట్టి కుండలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, చిన్న పిల్లలకు చల్లని మంచినీరు అందించేందుకు సొంత నిధులతో మట్టి కుండలను పంపిణీ చేసినట్లు తెలిపారు. గుడ్లు, పాలు పంపిణీ పకడ్బందీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వాసుదేవగుప్త, వానపల్లి ఉపసర్పంచ్ రామలింగేశ్వర రెడ్డి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యకర్తలకు కుండలు పంపిణీ చేస్తున్న దృశ్యం

సచివాలయ ఎఎన్ఎం సావిత్రిని సస్పెండ్ చేయాలి

- ఆశా వర్కర్స్ యూనియన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలోని నాలుగవ సచివాలయంలో పని చేస్తున్న ఎఎన్ఎం సావిత్రిని వెంటనే సస్పెండ్ చేయాలని కోరుతూ ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.నాగమణి, జి.రమణకుమారి డిఎంహెచ్ఒకు వినతిపత్రం బుధవారం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 17 సంవత్సరాలుగా ఆశ వర్కర్‌గా విధులు నిర్వహిస్తూ గర్భవతులకు, బాలింతలకు, ప్రజలకు సేవలు అందిస్తూ మంచి పేరు, గుర్తింపు తెచ్చుకున్న ఆశా కార్యకర్త నజీర్నిసాను ఎఎన్ఎం సావిత్రి వేధింపులకు గురి చేస్తూ మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తుందని అన్నారు. వేధింపులకు తట్టుకోలేక ఆశా కార్యకర్త నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య యత్నానికి పాల్పడిందన్నారు. గతంలో కూడా సావిత్రి పై స్థానిక డాక్టర్‌కు ఫిర్యాదు చేసి భవిష్యత్తులో ఇలా జరగకుండా చూడాలని కోరామన్నారు. కానీ సావిత్రి ప్రవర్తనలో మార్పు లేకుండా నిత్యం ఆశా కార్యకర్తలను వేధిస్తుండడం వల్లే నజురున్నిసా ఆత్మహత్యా యత్నానికి పాల్పడిందన్నారు . డిఎంహెచ్ఒ, నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్ ఎఎన్ఎం సావిత్రిని వెంటనే సస్పెండ్ చేసి ఆశా కార్యకర్తలకు రక్షణ కల్పించాలని కోరారు. **గడివేముల :** ఆశా వర్కర్‌ను వేధింపులకు గురి చేసిన నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో సచివాలయం ఎఎన్ఎం

సావిత్రిని సస్పెండ్ చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యురాలు బి. చెన్నమ్మ డిమాండ్ చేశారు. గడివేముల పిహెచ్‌సిలో నిరసన చేపట్టారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ తేజస్వినికి వినతి పత్రం అందజేశారు. సిఐటియు మండల కార్యదర్శి మద్దిలేటి, ఆశా వర్కర్స్ అషాబి, శ్యామల, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అపరిచితుల వీడియో కాల్స్ పట్ల జాగ్రత్త : ఎస్‌పి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

అపరిచితుల నుంచి వచ్చే వీడియో కాల్స్ పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని జిల్లా ఎస్‌పి కె. రఘు వీర్ రెడ్డి సూచించారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం టెక్నాలజీ అరచేతిలోకి రావడంతో ఆన్‌లైన్ కార్యకలపాలు విపరీతంగా పెరిగిపోయాయని, అదే స్థాయిలో సైబర్ నేరాల సంఖ్య అధికమవుతుందని తెలిపారు. సైబర్ నేరగాళ్లు కొన్ని పద్ధతులను ఉపయోగించి యూజర్లను మోసం చేస్తున్నారని చెప్పారు. వీడియో కాల్ ఫ్రాడ్, సోషల్ మీడియా యప్‌ల ద్వారా అందమైన యువతుల ఫొటోలు, పేర్లతో ప్రొఫైల్ క్రియేట్ చేసి వాటిని సోషల్ మీడియా ఖాతాలో ఉంచడం ద్వారా పలువురిని ట్రాప్ చేసి పరిచయం పెంచుకుంటారని, అనంతరం వీడియో కాల్ చేసి తద్వారా ఆ వీడియో కాల్ రికార్డింగ్స్, స్క్రీన్ షాట్ ఫొటోస్‌ని మీ ఇంట్లో వాళ్లకి పంపిస్తామని మానసిక వేదనకు గురిచేస్తారన్నారు. వీడియో కాల్ చేయడం ద్వారా అవతల వ్యక్తి మిమ్మల్ని రెచ్చగొట్టే విధంగా గురి చేసి వాటిని రికార్డ్ చేసి లేదా స్క్రీన్ షాట్ తీసుకొని వెంటనే కాల్ కట్ చేసి మళ్లీ తిరిగి కాల్ చేసి లేదా మరొక నెంబర్ నుండి కాల్ చేసి బెదిరింపులకు గురి చేయవచ్చన్నారు. తద్వారా బ్లాక్ మెయిల్ చేసి అందినకాడికి దోచుకుంటారని చెప్పారు. సైబర్ నేరాల నుంచి తప్పించుకోవడానికి ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఒకవేళ ఎవరైనా సైబర్ నేరాలకు గురయింటే వెంటనే 1930 కి కాల్ చేసి గాని www.cybercrime.gov.inలో 24 గంటల లోపల ఫిర్యాదు చేయాలని, లేదా దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసి రక్షణ పొందాలన్నారు. కావున అపరిచుతుల నుంచి వచ్చే ఫ్రెండ్ రిక్వెస్టులు అంగీకరించవద్దని, పని చేసే కార్యాలయ వివరాలు, వృత్తిపరమైన అంశాలు సోషల్ మీడియా ఖాతాలో పంచుకోవద్దన్నారు. సోషల్ మీడియా ఖాతాల్లో వచ్చే పోర్న్ వీడియో లింక్‌లను ఓపెన్ చేయవద్దని తెలిపారు.

మాట్లాడుతున్న జిల్లా ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షుడు వి.యేసురత్నం

మేడేను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి - ఆత్మకూర్

ప్రజా అనుకూల విధానాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతివాడలో కార్మికులు మేడే జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.యేసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్ నాయక్‌లు కోరారు. బుధవారం పట్టణంలోని డాక్టర్ ఏ.ధనుంజయ మీటింగ్ హాల్‌లో సిఐటియు పట్టణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీ సిపిఎస్ రద్దుచేయాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని, ఆటో, హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. స్కీం వర్కర్లయిన అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనపథకం కార్మికులు, స్కావెంజర్స్ యనిమేటర్ల, కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, అప్పటి వరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు పట్టణ ఉపాధ్యక్షులు రణధీర్, మండల కార్యదర్శి భాస్కర్, నాయకులు శివ, రాముడు, నాగరాజు, భారతి, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించాలి

- ఎపి కౌలు, రైతు సంఘాల డిమాండ్

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు మండలంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని, కనీస మద్దతు ధర రైతులకు, కౌలు రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని ఎపి కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి సుధాకర్, రైతు సంఘం మండల ప్రధాన కార్యదర్శి వీరన్నలు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని బాపనంతపురం గ్రామంలో మొక్కజొన్న రైతుల దగ్గరకు ధాన్యంను వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కజొన్న రైతులు, కౌలు రైతులు అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టి పంటలను సాగు చేశారన్నారు. ప్రభుత్వం కనీస మద్దతు ధర 1962 రూపాయలు గా నిర్ణయించిందన్నారు. కానీ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేకపోవడం వలన ప్రైవేట్ వ్యాపారస్తుల దోపిడీకి రైతులు గురవుతున్నారని చెప్పారు. ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, కాటా కూలీ, రవాణా చార్జీలు, సంచులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామంలోని రైతులు వెంకట్రావు, రాజశేఖర్, రామన్న, నాగేంద్ర, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతులతో మాట్లాడుతున్న నాయకులు

ప్రతి వార్డునూ అభివృద్ధి చేస్తాం

- స్పెషల్ గ్రాంట్ కింద రూ.6 కోట్ల 40 లక్షలు మంజూరు

- మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

ప్రజాశక్తి - డోన్

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సహకారంతో డోన్ మున్సిపాలిటీలో ఉన్న 32 వార్డులనూ అభివృద్ధి చేస్తామని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా సచివాలయాలకు వచ్చిన నిధులపై అధికారులతో బుధవారం రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్పెషల్ గ్రాంట్ కింద డోన్ మున్సిపాలిటీకి రూ.6 కోట్ల 40 లక్షలు మంజూరు అయ్యాయని తెలిపారు. డోన్ మున్సిపాలిటీకి నిధులు మంజూరు చేయించినందుకు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. మున్సిపాలిటీలోని అన్ని వార్డులలో రోడ్లు, కాలువలకు సంబంధించి ఒక్కొక్క వార్డుకు రూ. 20 లక్షల చొప్పున అభివృద్ధి చేసేందుకు కేటాయిస్తున్నామని చెప్పారు. ఇప్పుడు వరకు 8 సచివాలయాలకు రూ. 1 కోటి 60 లక్షల నిధులు మంజూరు చేశారని, పనులు తుది దశకు చేరుకున్నాయని తెలిపారు. అలాగే 4 సచివాలయాలకు 80 లక్షల రూపాయలు టెండర్ దశలో ఉన్నాయని చెప్పారు.

మాట్లాడుతున్న చైర్మన్ సప్తశైల రాజేష్

పనులను తొందరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మంత్రి పిఏ రమేష్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఏఇ జనార్దన్, టిపిఇ తదితరులు పాల్గొన్నారు.

సంతాపం తెలుపుతున్న నాయకులు

టిడిపి నాయకుడు మృతి

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి పట్టణానికి చెందిన టిడిపి ఆర్యవైశ్య నాయకుడు తొమ్మండ్రు గురుకుమార్(57) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర టిడిపి మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు ముల్లా అన్సర్‌బాష, టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి గుత్తి నర్సింహులు, నంద్యాల జిల్లా బిసి సెల్ స్పోక్ పర్సన్ సల్లానాగరాజులు మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాడ సానుభూతి వ్యక్తం చేశారు. సంతాపం తెలిపిన వారిలో టిడిపి నాయకులు కొలిమి షరీఫ్, వీరంరెడ్డి భాస్కర్ రెడ్డి, కామిశెట్టి రమేష్, చాంద్‌భాష, నాగూరు, నూర్‌భాష ఉన్నారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు : వైసిపి

ప్రజాశక్తి - ప్యాపిలి

పేదలందరికీ సంక్షేమ పథకాలు అందివ్వడమే ప్రభుత్వ లక్ష్యమని వైసిపి డోన్ నియోజకవర్గ పరిశీలకులు కోన మురళీధర్ రెడ్డి, జడ్పిటిసి శ్రీరామ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ బోరెడ్డి పుల్లారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ బోరా మల్లికార్జునరెడ్డి అన్నారు. జగనన్న మా భవిష్యత్తు కార్యక్రమం బుధవారం ప్యాపిలి మెయిన్ రోడ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలే ప్రభుత్వంగా, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా జగనన్న పాలన నడుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి జంగం చంద్రయ్య, బోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, పర్వతం శీను, మధు, రంగనాయకులు, బషీర్, సోమశేఖర్, జింకల అంజి, రామకృష్ణ, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్న వైసిపి నాయకులు

భూగర్భ జలాలు పెంచాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - బేతంచెర్ల

భూగర్భ జలాలు పెంచడంలో అందరూ బాధ్యత వహించాలని ఎంపీడీవో వెంగన్న అన్నారు. బుధవారం మండలంలోని ఆర్.బుక్కాపురం గ్రామంలో ఎపిఒ శేషన్న ఆధ్వర్యంలో గ్రామ సమీపంలోని సోంపురం కుంటలో జరుగుతున్న ఉపాధి పనెఉలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్‌ఆదేశాల మేరకు మండలంలోని ఆయా గ్రామాలలో ఊరకుంటలలో భూగర్భ జలాలను పెంచేందుకు పూడికల తీత చేపట్టినట్లు తెలిపారు. ఉపాధి కూలీలు ఎండాకాలన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతిరోజు ఉదయం 6 గంటల నుండి 10లోపు పని పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ మోహన్, మేటి శేషు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

ప్రజాశక్తి - బేతంచర్ల

ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో బేతంచెర్ల పట్టణంలోని నిరుపేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిటీ నాయకులు మాట్లాడుతూ కమిటీ అందరి సహకారంతో రంజాన్ తోఫాను 300 నిరుపేద ముస్లిం కుటుంబాలకు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు మహబూబ్ అలీ, షేక్ హుస్సేన్, షేక్షావలి, నూర్ అహ్మద్, వలి, ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫాను పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు

దానగుణం పెంచేది రంజాన్

ప్రజాశక్తి - బనగానపల్లె

దాన గుణాన్ని పెంపొందించేది రంజాన్ పండగ అని సహారా ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ యస్.అబ్బాస్ హుస్సేన్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని సహారా ముస్లిం మైనారిటీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 70 మంది ముస్లిం పేదలకు రంజాన్ తోఫాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం పవిత్ర రంజాన్ మాసం పండుగ సందర్భంగా 70 మంది ముస్లిం పేదలకు తోఫాను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. 5 కేజీల సన్న బియ్యం, 30 గ్రాముల మోడీ టీ పొడి, 500 రూపాయల నగదును అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు కెఎన్‌డి ఖాజా హుస్సేన్, ఎస్.సమీఉద్దీన్, ఎస్. ఫైజుల్లా, ఎస్.హాజీవలి, ఎస్.మహబూబ్ బాషా, ఎస్.జీలాన్, మోడీ మార్కెటింగ్ ఆఫీసర్ ఎస్.అన్వర్, కలాం తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పంపిణీ చేసే రంజాన్ తోఫా

21 నుంచి కుంభాభిషేక మహోత్సవాలు

- బిసి ఇందిరాకు ఆహ్వాన పత్రిక అందజేసిన ఆర్యవైశ్య సంఘం నాయకులు

ప్రజాశక్తి - బనగానపల్లె

కొలిమిగుండ్ల మండలం తిమ్మనాయుని పేట గ్రామంలో ని అమ్మవారి శాలలో వాసవి కన్యకా పరమేశ్వరి శతసంవత్సర కుంభాభిషేక మహోత్సవాలు ఈ నెల 21, 22, 23న నిర్వహిస్తున్నట్లు ఆర్య వైశ్య సంఘం నాయకులు తెలిపారు. బుధవారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి నివాసంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు కుంభాభిషేక మహోత్సవాలకు రావాలని బిసి ఇందిరాకు ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో టిడిపి వాణిజ్య విభాగం నంద్యాల పార్లమెంట్ అధ్యక్షులు టంగుటూరు శీనయ్య, ఆర్యవైశ్య సంఘం నాయకులు సుధాకర్ శెట్టి, బాలసుబ్రమణ్యం, బాలు తదితరులు పాల్గొన్నారు.

బిసి ఇందిరాకు శత సంవత్సర ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

నేడు అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్ : మండలంలోని ఏ కోడూరు గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్టు నిర్వాహక కమిటీ అధ్యక్షుడు కుమార్ బాబు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు చిన్న సంజీవరెడ్డి, జడ్పిటిసి బారెడ్డి తులసమ్మ, ఎస్‌సి కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌లు హాజరవుతారని తెలిపారు. మండలంలోని ప్రజాసంఘాల నాయకులు, మేధావులు, ప్రజలు, రాజకీయ నాయకులు అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు పాములపాడు క్రీడాకారులు ఎంపిక

ప్రజాశక్తి - పాములపాడు : ఈ నెల 21 నుంచి 24 వరకు ధర్మవరంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పాములపాడు మండలానికి చెందిన ఏడుగురు క్రీడాకారులు ఎంపికయ్యారని సీనియర్ హాకీ క్రీడాకారుడు జంబులయ్య బుధవారం తెలిపారు. ఈ నెల 16న నంద్యాల జిల్లా కేంద్రంలో ఉమ్మడి జిల్లా సీనియర్ హాకీ మెన్స్ పోటీలు జరిగాయి. ఈ పోటీలలో చక్కటి ప్రతిభ కనబరిచిన పాములపాడు మండలానికి చెందిన జమ్ములయ్య, మధు, వాసు, దినేష్, రవికుమార్, చిన్న ఉరుకుందు, నాగన్నలు ఎంపికయ్యారు. ఈ నెల 21 నుంచి 26 వరకు ధర్మవరంలో జరిగే పోటీలలో పాల్గొననున్నారు.

21న మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : పట్టణంలోని కెవి సుబ్బారెడ్డి డిగ్రీ కళాశాలలో ఈనెల 21న నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను అర్హులైన యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ శ్రీనాథ్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక కళాశాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ టెక్ మహీంద్రా కంపెనీ వారు కస్టమర్ ఎగ్జిక్యూటివ్ అసోసియేట్ (వాయిస్ ప్రాసెస్, నాన్ టెక్నికల్) విభాగానికి, హెటిరో ల్యాబ్ వారు పలు విభాగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. కావున ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ పూర్తి చేసిన నిరుద్యోగ అభ్యర్థులు ఈ ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హత పత్రాలతో ఈ నెల 21న ఉదయం 9 గంటలకు కెవి సుబ్బారెడ్డి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జరిగే జాబ్ మేళాకు హాజరు కావాలన్నారు. పూర్తి వివరములకు 9542704025, 9642244124, 9676758937, 8688755219 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

అక్రమ కట్టడాలు ఆపాలి : సిపిఐ

ప్రజాశక్తి - బనగానపల్లె : అక్రమ కట్టడాలను ఆపకపోతే ఉద్యమాలు ఉధృతం చేస్తామని సిపిఐ మండల కార్యదర్శి సుబ్బారెడ్డి హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ శ్రీనివాస గౌడుకు కబ్జాలను అరికట్టాలని, అక్రమ కట్టడాలను నియంత్రించాలని సిపిఐ నాయకులు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ సమీపంలో అక్రమంగా భూకబ్జాదారుల ఆక్రమించుకున్న ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను దళారులు ఆక్రమించి అక్రమ కట్టడాలను కడుతున్నారని తెలిపారు. అధికారులు అక్రమ కట్టడాలపై స్పందించకపోతే సిఎం క్యాంపు కార్యాలయం దగ్గర దీక్షకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ శివ బాలకృష్ణ, సిపిఐ జిల్లా సభ్యులు శివయ్య, కాలింగిరి రాముడు, మండల నాయకులు ఖాదర్, శివ నాగయ్య, కుళ్లాయప్ప, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడి చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి - బనగానపల్లె : కర్నూలు జిల్లా మద్దికెర మండలం యం.అగ్రహారం గ్రామంలో ఎరుకలి మహిళ నాగలక్ష్మిపై దాడి చేసిన కురువ నరసప్ప, కురువ రాంబాబు, కురువ సాయి, కురువ రాంబాబులను కఠినంగా శిక్షించాలని ఎపి ఎరుకల సేవా సంఘం జిల్లా కార్యదర్శి దేగల విఘ్నేశ్వరుడు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఎరుకల సేవ సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ అట్రాట్ సిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

పేద మహిళలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి - బనగానపల్లె రూరల్ : పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకొని ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో పేద మహిళలకు బుధవారం పట్టణంలో ఎంఐఎం పార్టీ ఇన్‌ఛార్జ్ ఎస్ఎండీ ఇస్మాయిల్. (అమ్మబా) ఆధ్వర్యంలో నందివర్గం ఎస్సై రామాంజనేయరెడ్డి చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రంజాన్ పండుగను ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలన్నారు. పేదలకు జకాత్ రూపంలో వీలైనంత సాయం చేయాలని సూచించారు.

చీరలను పంపిణీ చేస్తున్న నందివర్గం ఎస్ఐ

మహారాజ శ్రీ నంద్యాల రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు : నంద్యాల.

I P No. 11 / 2021

కోడూరు సుబ్బరాయుడు. ...పిటిషనర్

Versus

K.ఈశ్వర్ రెడ్డి & others. ...రెస్పాండెంట్స్

జే.శారదాబాయి (Respondent No.29)
W/o తిరుపాల్ రావు, తెలుగుపేట, నంద్యాల టౌన్ & జిల్లా
నల్లగంగుల వెంకట రమణా రెడ్డి (Respondent No.30)
S/o వెంకట రెడ్డి, మున్సిపల్ కాంప్లెక్స్,
ప్రతాప్ థియేటర్ ప్రక్కన, నంద్యాల టౌన్ & జిల్లా.

29 & 30 రెస్పాండెంట్లుకు నోటీసు ప్రకటన

సదరు పై అర్జీ లో పిటిషనర్ కోర్టు ద్వారా పంపిన సమన్లు పైన తెలిపిన Respondent No.29 & 30 ప్రతివాదులిద్దరికి అందకపోవడం వలన ఈ పేపర్ ప్రకటన ద్వారా ప్రతివాదులిద్దరికి తెలియజేయడమైనది. సదరు అర్జీపై పైన తెలిపిన ప్రతివాదులకు ఏవైనా ఆక్షేపణలు ఉన్న ఎడల పై కోర్టు యందు 28-04-2023 వ తేదీన ఉదయం 10.30 గంటలకు పై కోర్టు వారి ఎదుట కుద్దున గాని, వకీలు ద్వారా గాని తమ ఆక్షేపణలు తెలుపుకొన వచ్చును. లేదా మీ పరోక్షముగా పై I P పిటిషన్ ను తీర్మానం చేయగలరని తెలపడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేదీ : 28-04-2023

Sri S. PANEENDRANATH
Advocate, Nandyal
9866862962.

కర్నూలులో బుధవారం ప్రభుత్వం తరుపున ఇచ్చిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న కలెక్టర్ డాక్టర్ సృజన, జెసి నారపరెడ్డి మౌర్య, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ తదితరులు